RNI Reg-No. APTEL/2005/15854

# నేటి మనదేశం

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Visakhapatnam, Vijayawada, Tirupati & Hyderabad

Website : https://netimanadesam.com/

సంపుటి : 21 సంచిక : 59 విశాఖపట్నం సంపాదకులు : కె.ఎస్.రంగశాయి శనివారం 11-04-2026 పేజీలు :8 వెల : రూ.1-00

### రాజ్యసభ సభ్యుడిగా

# నితీశ్ ప్రమాణం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 :** బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శుక్రవారం రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సి.పి రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లో నితీష్‌కుమార్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. నితీష్‌కుమార్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, రాజ్యసభ నేత జెపి నడ్డా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌లు హాజరయ్యారు. అలాగే జెడియు నేత, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజరు కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జైరాం రమేష్, బిజెపి ఎంపి మాజీ కేంద్రమంత్రి అయిన రాజీవ్ ప్రతాప్ రూడీ తదితరులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్‌డిఎ తదుపరి బీహార్ సిఎం ఎవరనేది త్వరలోనే వెల్లడించనుంది. బహుశా ఏప్రిల్ 14న కొత్త ముఖ్యమంత్రిని ఎన్‌డిఎ ఎన్నుకునే అవకాశం ఉంది.



# కేబినేట్ ఎజెండా ముందే లీక్

- కీలక అంశాలు సైతం ముందే వెల్లడి
- గతంలో ఇలా జరిగితే ఎన్టీఆర్ కేబినేట్ రద్దు చేశారు
- సమాచారం లీక్ అయితే అందుకు మంత్రులదే బాధ్యత
- కేబినేట్ భేటీలో సిఎం చంద్రబాబు సీరియస్ వార్నింగ్
- జలధార తదితర పథకాలపై ప్రచారం కల్పించాలని ఆదేశం





**అమరావతి, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశం దాదాపు 3 గంటలకు పైగా సాగింది. ఈ సమావేశంలో.. అమరావతికి ఆమోదంపై కేంద్రానికి, ప్రధాని మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలపడంతో పాటు.. కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది కేబినెట్.. అయితే, ఎజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత.. మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన సీఎం చంద్రబాబు.. కీలక సమాచారం లీక్ అవుతున్న అంశంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్ అజెండాతో పాటు ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన వివరాలు ముందుగానే బయటకు ఎలా వస్తున్నాయంటూ మంత్రులను ప్రశ్నించారు. ఇకపై క్యాబినెట్ సమావేశానికి ముందే ఎజెండా లీకైతే సంబంధిత మంత్రులే బాధ్యత వహించాల్సి వస్తుందని స్పష్టంగా హెచ్చరించారు. గతంలో ఇలాంటి లీకుల కారణంగా ఎన్టీఆర్ తన కేబినెట్‌ను రద్దు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, అలాంటి పరిస్థితి మళ్లీ రాకూడదని చెప్పారు. ఎన్టీఆర్ ఎవరు లేకుండా 15 రోజులు ప్రభుత్వాన్ని నడిపారని సీఎం గుర్తు చేశారు. పేపర్ లీక్ కేసులో ఆ రోజు బాలయోగి రాజీనామా చేశారని చెప్పారు. ఇప్పుడు సాంకేతికతతో ఎవరి నుంచి లీక్ అయిందో తేలికగా కనుక్కోవచ్చని స్పష్టం చేశారు. మంత్రులు, కార్యదర్శులు బాధ్యతగా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అదేవిధంగా, ప్రభుత్వ పథకాల అమలుపై కూడా సీఎం మంత్రులకు పలు సూచనలు చేశారు. 'జలధార' పథకం గురించి ప్రజల్లో మరింత అవగాహన

తరువాయి 2లో..

# బెంగాల్‌లో మోదీ 6 గ్యారంటీలు

## తృణమూల్‌ను సాగనంపండని పిలుపు




**హల్దియా, సురీ, ఏప్రిల్ 10 :** పశ్చిమ బెంగాల్‌లోని క్రూరమైన (నిర్మమ్) తృణమూల్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. అభివృద్ధి విచ్ఛిన్నానికి కొత్త ప్రమాణాలను నెలకొల్పిన మమతా బెనర్జీ సర్కారు రాష్ట్రాన్ని మరింత దిగజారుస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలోకి వస్తే 6 గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. తృణమూల్ భయానక పాలనను పారదోలి ప్రజల్లో విశ్వాసాన్ని నింపుతామని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన పూర్వ మేదినీపూర్‌లోని హల్దియాలో జరిగిన సభలో మాట్లాడారు. 'దేశమంతా అభివృద్ధి పథంలో సాగుతుంటే తృణమూల్ సర్కారు వల్ల బెంగాల్ వెనక్కి వెళ్తోంది. వికసిత్ బెంగాల్ కోసం క్రూర తృణమూల్ ప్రభుత్వాన్ని సాగనంపండి' అని ప్రజలకు పిలుపునిచ్చారు.

**6 గ్యారంటీలివే.. :** తృణమూల్ భయానక పాలనకు చరమగీతం పాడతాం. భాజపా ప్రభుత్వం ప్రజల్లో విశ్వా

- మిగతా 2లో..

# ప్రభుత్వ ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్ : బిజెపి మేనిఫెస్టో




**కోల్‌కతా, ఏప్రిల్ 10 :** పశ్చిమ బెంగాల్ ఎన్నికల దృష్ట్యా శుక్రవారం బిజెపి మేనిఫెస్టోని విడుదల చేసింది. కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా 'సంకల్ప్ పాత్ర' పేరుతో ఆయన మేనిఫెస్టోని విడుదల చేశారు. ఈ మేనిఫెస్టోలో ప్రధానంగా 15 హామీలను బిజెపి ఇచ్చింది. బిజెపి అధికారంలోకి వస్తే.. ఐదేళ్లలో కోటి ఉద్యోగాల కల్పన, స్వయం ఉపాధి అవకాశాల్ని కల్పించనున్నట్లు హామీ నిచ్చింది. నిరుద్యోగ యువతకు పదివేల ఆర్థిక సాయం చేయన్నుట్లు ప్రకటించింది. మహిళల సాధికారతకు దుర్గా సురక్షా సహాయ పథకం కంద మహిళలతో కూడిన పోలీస్ బెటా లియన్ల ఏర్పాటు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్. మహిళా లబ్ధిదారులకు నెలకు మూడు వేల ఆర్థిక సహాయం, మహిళలకు ఉచిత బస్సు వంటి హామీల నిచ్చింది. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో చేరే అవివాహిత విద్యార్థినులకు 50 వేలు చెల్లింపు వంటి హామీలనిచ్చింది. వీటితో పాటు ఉచి తంగా హెచ్‌పివి టీకా, బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్, ఉత్తర బెంగాల్‌లలో ఎయిమ్స్, ఐఐటి, ఐఐఎం వంటి సంస్థలను విస్తరిస్తామని బిజెపి మేనిఫెస్టోలో హామీ నిచ్చింది. ఉమ్మడి పౌరస్మృతిని అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అమలు చేస్తామని అమిత్ షా ప్రకటించారు.

# రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు ఆమోదం

- క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులో మూడు సంస్థల ఏర్పాటు
- విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు
- విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయింపు
- సత్యసాయి జిల్లాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ కోసం ఆర్‌ఆర్ ఎలక్ట్రానిక్స్‌కు 60 ఎకరాలు
- కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి




**అమరావతి, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. సచివాల యంలో దాదాపు 3 గంటలకు పైగా కేబినెట్ భేటీ కొన సాగగా.. ముఖ్యంగా రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి మంత్రి మండలి ధన్యవాదాలు తెలియజేసింది. ఈ సమావేశంలో 16వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో చర్చించిన పలు పెట్టు

- మిగతా 2లో..

# ప్రారంభోత్సవానికి రెడీ అవుతున్న భోగాపురం

- జూలైలో ప్రారంభోత్సవానికి తేదీలు ఖరారు
- జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన డేట్లు ఫిక్స్ చేసిన ప్రభుత్వం
- ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీకి ఆహ్వానం



వార్త.. 2 లో

# శ్రీకాకుళం సాగునీటిని గాలికి వదిలేసిన వైసీపీ

- జిల్లాకు సాగునీటి వసతి కల్పించడమే లక్ష్యం
- వంశధారతో సమస్యలను తీర్చే ప్రయత్నం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి



**శ్రీకాకుళం, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రీకాకుళంలో సాగునీటి వ్యవస్థను గాలికి వదిలేశారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ ఆధారితమని, జిల్లా ప్రజలకు సాగునీటి భద్రత కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వంశధార నీటిని సద్వినియోగం చేసుకుని జిల్లాను సస్యశ్యామలం చేయాలని పూనుకున్నట్లు ఆయన చెప్పారు. 2010లో వంశధార ట్రైబ్యునల్ ఏర్పాటు అయ్యిందని.. అప్పటి నుంచి నేరడి బ్యారేజ్ విషయంలో ఒడిశాతో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసినట్లు ఆయన చెప్పారు. 2024లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నేరడి బ్యారేజ్ సమస్యపై దృష్టి పెట్టామని ఈ సందర్భంగా రామ్మోహన్ చెప్పుకొచ్చారు. ఒడిశాలోనూ బీజేపీ ప్రభుత్వం రావటంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయ్యిందని హర్షం వ్యక్తం చేశారు. వంశధార ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు ఆధారంగా గెజిట్ నోటిఫికేషన్ తెచ్చుకున్నామని.. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారమైందని తెలిపారు. దీనిపై వైసీపీ నేతలు ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. కేంద్ర మంత్రి అయినా తన మొదటి ప్రాధాన్యత జిల్లా అభివృద్ధికే అని రామ్మోహన్ స్పష్టం చేశారు. త్వరలో నేరడి బ్యారేజ్ పనులు ప్రారంభమవుతాయని.. రైల్వే జోన్ సాధించుకోవటం మరో విజయమంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంతంలోని ఏడు రైల్వేస్టేషన్లను కొత్త రైల్వే జోన్‌లో పెట్టించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. తిరుపతి వెళ్లే భక్తుల కోసం హంసఫర్ ఎక్స్‌ప్రెస్ ఇకపై శ్రీకాకుళం నుంచి బయలుదేరుతుందంటూ ఆయన గుడ్ న్యూస్ చెప్పారు. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేశామని.. పొందూరు ఖాదీకి జియో ట్యాగ్ సాధించామనీ వెల్లడించారు. కేంద్రం నుంచి జిల్లాకు అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తున్నానని రామ్మోహన్ పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి జరుగుతుంటే వైసీపీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్ ఆగ్రహించారు.

తరువాయి 2లో..

మొదటిపేజీ తరువాయి...

# కేబినేట్ ఎజెండా ముందే లీక్

కల్పించాలని సూచించారు. పాస్‌బుక్స్ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు, సంబంధిత మంత్రులు నెలకు కనీసం నాలుగు సార్లు ప్రాంతాల వారీగా పర్యటించాలని ఆదేశించారు. 'సూర్య ఘర్' పథకంపై మరింత దృష్టి పెట్టాలని, వచ్చే ఏడాదితో ముగియనున్న లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని మంత్రులకు నిర్దేశిరచారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే మహిళా బిల్లుపై కూడా కేబినెట్‌లో చర్చ జరిగింది. ఇక, రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మూడు నుంచి నాలుగు నెలల వ్యవధిలో ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మొత్తంగా, ఏపీ కేబినెట్‌లో లీకుల అంశంపై సీఎం చంద్రబాబు గట్టి హెచ్చరిక జారీ చేయడంతో పాటు, ప్రభుత్వ పథకాల అమలుపై స్పష్టమైన దిశానిర్దేశర చేశారు. అజెండా అంశాలు ముగిశాక వివిధ అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. కేబినెట్ సమావేశం ప్రారంభమైనా అజెండా మాత్రం మంత్రులకు రాలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావించారు. అజెండా ముందే వస్తే స్టడీ చేసుకుని కేబినెట్‌కు వచ్చే వీలు ఉండేదన్నారు. దీంతో వివిధ శాఖల కార్యదర్శుల పనితీరుపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవస్థలు రాను రాను మరింత ఉపయోగపడాల్సింది పోయి క్లిష్టంగా మారుతున్నాయంటూ అధికారుల తీరను ముఖ్యమంత్రి తప్పుబట్టారు. కార్యదర్శులు గతంలో స్జబెక్టుల్లో భాగస్వాములవుతూ చర్చల్లో ఏ సందేహం వచ్చినా పూర్తిగా నివృత్తి చేసేందుకు చొరవ చూపేవారని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఇప్పుడా పరిస్థితి లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. డీమ్డ్ యూనివర్సిటీలను రాష్ట్రంలో ఎక్కువ ప్రమోట్ చేయాలని సీఎం ఆదేశించారు. 10 ఎకరాలు తక్కువ కాకుండా నిబంధనలు పెట్టి నాణ్యత పెంచుతూ ఎక్కువ సంఖ్యలో డీమ్డ్ యూని వర్సిటీలను అందుబాటు లోకి తీసుకు రావాలన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో తక్కువ డీమ్డ్ యూనివర్సిటీలు ఉన్నాయని సీఎం తెలిపారు. జలధార, సూర్యఘర్, పీఎం కుసుమ్, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను మంత్రులు ఓనర్ షిప్ తీసుకోవాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ప్రతి మంత్రి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి సంబంధించి నాలుగు కార్యక్రమాల్లో అయినా పాల్గొనాలని ఆదేశించారు. కూటమి ఎమ్మెల్యేలూ ఇదే అనుసరించాలన్నారు. జలధారకు ఉపాధి హామీ నిధులు అనుసంధానం అయ్యేలా పనులు చేపట్టాలని సీఎం నిర్దేశిరచారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ కింద వీలైనన్ని ఎక్కువ కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ ఉండాలన్నారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధుల నివారణకు కృషి చేసేలా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.

# బెంగాల్‌లో మోదీ 6 గ్యారంటీలు

సాన్ని నింపుతుంది. పాలనా వ్యవస్థలో మార్పులు చేసి పౌరులకు ప్రభుత్వోద్యోగులను జవాబుదారీగా చేస్తాం. అవినీతితోపాటు మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించిన అన్ని కేసులను తెరిచి నిందితులకు శిక్ష పడేలా చేస్తాం. అవినీతిలో కూరుకుపోయిన నేతలందరినీ వారి స్థాయితో సంబంధం లేకుండా జైళ్లలో పెడతాం. ఏ ఒక్క తృణమూల్ గూండా తప్పించుకోకుండా చూస్తాం. భారత్‌లో చట్టపరంగా ఆశ్రయం పొందిన శరణార్థులందరికీ ప్రభుత్వ సౌకర్యా లను కల్పించడంతోపాటు సంక్షేమ పథకాలను అందిస్తాం. చొరబాటుదారులను మాత్రం దేశం నుంచి పంపించేస్తాం. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 7వ వేతన కమిషన్ సిఫార్సులను అమలు చేస్తాం.

## శ్రీకాకుళం సాగునీటిని

# గాలికి వదిలేసిన వైసీపీ

ప్రజల కోసం పని చేసే నేతలైతే కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేసిన పనులను అభినందించాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందడం చరిత్రాత్మక ఘట్టమని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అమరావతి బిల్లుకు కాంగ్రెస్ కూడా మద్దతు ఇచ్చిందని.. జగన్ పార్టీ మాత్రం బిల్లు సందర్భంగా పార్లమెంట్ నుంచి వాకౌట్ చేసిందని మండిపడ్డారు. అమరావతి చట్టబద్ధత కోసం సీఎం చంద్రబాబు నాయుడు చాలా కృషి చేశారని చెప్పుకొచ్చారు. రాజధానిగా అమరావతికి రాష్ట్ర ప్రజలు ఎన్నికల ద్వారా సంపూర్ణ మద్దతు ఇచ్చారని చెప్పుకొచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు రాజధానిపై జగన్ మూడు ముక్కలాట ఆడారని.. ఇప్పుడూ అదే డ్రామాలు ఆడుతున్నా రని విమర్శించారు. అమరావతి పూర్తయితే చంద్రబాబు పేరు చిరస్థాయిగా నిలిచి పోతుందన్న భయం వైసీపీదని ఆరోపించారు. జాతీయస్థాయిలో చంద్రబాబుది ఓ ప్రత్యేక గుర్తింపని కొనియాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదనేది వైసీపీ అజెండా అయితే.. చంద్రబాబుది అభివృద్ధి అజెండా అని పేర్కొన్నారు. ప్రజలు ఛీ కొట్టినా వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదని.. చరిత్ర హీనులుగా మిగిలి పోవడం ఖాయమంటూ నిప్పులు చెరిగారు. విశాఖ రాజధాని పేరుతో వైసీపీ నేతలు భూదందా చేశారని ఆరోపించారు రామ్మోహన్ నాయుడు. త్వరలో భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు పూర్తవుతాయని.. కేంద్రం సహకారంతో రాష్ట్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఒక పక్క అభివృద్ధి జరుగుతుంటే మరో పక్క వైసీపీ నేతలు గుంట నక్క రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి ఆగ్రహించారు.

# రూ.39,436 కోట్ల విలువైన

## 31 ప్రాజెక్టులకు ఆమోదం

బడి ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడనున్నాయి. అదేవిధంగా, క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులో భాగంగా మూడు సంస్థల ఏర్పాటుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లే కీలక అడుగుగా భావిస్తున్నారు. ఇక జోనల్ వ్యవస్థకు సంబంధించి కూడా కేబినెట్‌లో చర్చ జరిగింది. రాష్ట్ర పరిపాలనలో సమతుల్యత కోసం తీసుకునే చర్యలపై అధికారులు వివరాలు సమర్పించారు. పలు పరిశ్రమలు, సంస్థలకు భూ కేటాయింపుల విషయంలో కూడా కేబినెట్ అనుమతులు ఇచ్చింది. మొత్తం 60కి పైగా ఎజెండా అంశాలను పరిశీలించిన కేబినెట్, వాటిలో ముఖ్యమైన వాటికి ఆమోదం తెలిపింది. మొత్తానికి, ఈ కేబినెట్ సమావేశం రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేసే పలు నిర్ణయాలతో ముగిసిందని అధికారులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.9.36 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.

తద్వారా 9.62 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. సమావేశం వివరాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు.

విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం ఇచ్చింది. సత్యసాయి జిల్లాలో ఔట్‌సోర్స్ సెమీకండక్టర్ అసెంబ్లీ టెస్టింగ్ సౌకర్యం రానుంది. సత్యసాయి జిల్లాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ కోసం ఆర్ఆర్ ఎలక్ట్రానిక్స్‌కు 60 ఎకరాల కేటాయింపునకు ఆమోదం ఇచ్చారు. ఏపీఐ ఐసీ, టీసీఎస్ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదం ఇచ్చారు. ఏపీఐఐసీ, రహేజా కార్ప్ సంస్థ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదంఇచ్చారు.

## పరాకాష్టకు చేరిన వైసిపి రాజకీయం... క్రిమినల్స్ ఇలానే రాజకీయంచేస్తారు మంత్రులతో సిఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి, ఏప్రిల్ 10 :** వైసీపీ అరాచకాలు పరాకాష్టకు చేరాయి. ఎవరిని లేపుతారు.. ఇటువంటి క్రిమినల్స్ చేసే బెదిరింపులకు ఎవరూ భయపడరని సీఎం చంద్రబాబు అన్నారు. వైసిపి క్రిమలన్ రాజకీయాలతో జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు సూచించారు. వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై ఏబీ కేబినెట్‌లో చర్చ జరిగింది. మంత్రి నిమ్మల రామానాయుడు ఈ అంశాన్ని ప్రస్తావించారు. 'కొత్త పలుకు కాదు... ఇక పలుకే ఉండదు' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వ్యాఖ్యానించినట్లు రామానాయుడు కేబినెట్‌కు తెలియజేశారు. దీనిపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. క్రిమినల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లో నూ ఫర్మ్‌గా డీల్ చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. బెదిరించి భయపెడదామని అనుకుంటున్నారని మండిపడ్డారు.

# ప్రారంభోత్సవానికి రెడీ అవుతున్న భోగాపురం

**విశాఖపట్నం, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఏపీ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. జూలై మొదటి వారంలో ఈ విమానాశ్రయం ప్రారంభం కానుండటంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోనున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు తుది దశకు చేరుకున్నాయి. జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇప్పటికే ఆహ్వానం పంపారు. మోదీ షెడ్యూల్ ఆధారంగా జూలై 5వ తేదీ లేదా 8వ తేదీల్లో ఒకటి ఖరారు కానుంది. జూన్ 30వ తేదీ కల్లా మిగిలిన అన్ని పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తున్నారు. అంతర్జాతీయ విమానాల రాకపోకల కోసం అవసరమైన ఇమ్మిగ్రేషన్ స్టేటస్ నోటిఫికేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేసింది. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. విశాఖపట్నం నుంచి భోగాపురం వెళ్లే మార్గంలో అత్యంత రద్దీగా ఉండే ఆనందపురం జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ఫ్లైల ఓవర్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. దీనికి సంబంధించిన డీపీఆర్ 45 రోజుల్లో సిద్ధం కానుంది. భోగాపురం వరకు మెట్రో సౌకర్యాన్ని కల్పించేందుకు సంస్థ సవరించిన డీపీఆర్‌ను సిద్ధం చేస్తోంది. ఇది డబుల్ డెక్కర్ మోడల్‌లో ఉండబోతోంది (కింద రోడ్డు, పైన మెట్రో). విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి భోగాపురం వరకు ఈ కారిడార్ విస్తరించనుంది. రోడ్ నంబర్ 12, 14 పనుల కోసం అటవీ, రక్షణ శాఖల అనుమతులను వేగవంతం చేశారు. తీర ప్రాంతం వెంట విశాఖను భోగాపురంతో కలిపే ప్రత్యేక కోస్టల్ కారిడార్ పనులు కూడా ఊపందుకున్నాయి. భోగాపురం ఎయిరోసిటీ, ఐటీ హబ్స్, లాజిస్టిక్ పార్కుల వల్ల ఈ ప్రాంతంలో వేలాది మందికి ఉపాధి లభించనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ విమానాశ్రయం వల్ల ఉత్తరాంధ్రలోని పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది.

ఫార్మా, మత్స్య పరిశ్రమల ఎగుమతులకు ఈ విమానాశ్రయం కేంద్ర బిందువుగా మారనుంది. భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు త్వరలో పూర్తవుతాయని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. కేంద్రప్రభుత్వ సహకారంతో ఏపీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు జూలై మొదటి వారంలో ప్రారంభించటానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఇదో మైలు రాయని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభించటానికి ప్రయత్నిస్తున్నామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# క్యూ 1లో గణనీయమైన అమ్మకాలు జరిపిన బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా




**విశాఖపట్నం, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా 2026 సంవత్సరపు మొదటి త్రైమాసికంలో (క్యూ1) ఇప్పటివరకు అత్యధిక కారు అమ్మకాలను నమోదు చేసింది. కంపెనీ మొత్తం 4,567 కార్లు విక్రయించింది, ఇది గత సంవత్సరంతో పోలిస్తే 17 శాతం బలమైన వృద్ధిని సూచిస్తుంది. సంవత్సర ప్రారంభం చాలా సానుకూలంగా ఉండి, ప్రతి నెల కూడా ఇప్పటివరకు అత్యుత్తమ అమ్మకాల ప్రదర్శనను నమోదు చేసిందని బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా అధ్యక్షుడు హరదీప్ సింగ్ బ్రార్ అన్నారు. సంస్థ 2026 సంవత్సరాన్ని చాలా బలమైన స్థితిలో ప్రారంభించింది. ప్రపంచ ఆర్థిక మరియు భౌగోళిక రాజకీయ సవాళ్లు ఉన్నప్పటికీ, క్యూ 1లో ఇప్పటివరకు అత్యధిక అమ్మకాలను సాధించామన్నారు. భారతదేశంలో లగ్జరీ ఎలక్ట్రిక్ మొబిలిటీలో మా నాయకత్వం మా కస్టమర్ల నమ్మకానికి ప్రతిఫలం. 2026లో మా అతిపెద్ద ప్రొడక్ట్ ఆఫెన్సివ్ ఉంటుంది, ఇందులో 27 కొత్త లాంచ్‌లు ఉంటాయి. ప్రతి కొత్త వాహనంతో అనుభవాన్ని అందించడం కొనసాగిస్తామన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు (ఈ వీ) లగ్జరీ విభాగంలో ఎలక్ట్రిక్ మొబిలిటిని ప్రధాన ప్రవాహంలోకి తీసుకువస్తూ, బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా భారతదేశంలో అత్యంత ప్రాచుర్యం పొందిన లగ్జరీ ఈ వీ బ్రాండ్‌గా కొనసాగుతోందన్నారు. క్యూ 1లో కంపెనీ 1,185 బీ ఎం డబ్ల్యూ మరియు మినీ ఈవీ లను విక్రయించింది. ఇది 83 శాతం వృద్ధిని సూచిస్తుందన్నారు.

# హరివంశ్ నారాయణ సింగ్ కు మరో ఛాన్స్

**– రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేసిన కేంద్రం – మరోమారు డిప్యూటి ఛైర్మన్ అయ్యే అవకాశం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 :** రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ కొనసాగే అవకాశముంది. అనుభవజ్ఞుడైన నాయకుడిగా, నిష్పక్షపాతంగా సభను నడిపించే సమర్థత కలిగిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. భారత పార్లమెంట్ ఎగువసభలో అత్యంత హుందాతనం గల నేతగా పేరుగాంచిన హరివంశ్.. మరోసారి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగబోతున్నారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనను నామినేట్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80 ప్రకారం.. సాహిత్యం, శాస్త్రం, కళలు, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష కృషి చేసిన 12 మందిని రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు. హరివంశ్ తనకున్న సుదీర్ఘ జర్నలిజం అనుభవం, సామాజిక స్పృహతో ఈ కోటాలో ఎంపికయ్యారు. బిహార్ నుంచి జేడీయూ తరపున ఎన్నికైన ఆయన సభ్యత్వ కాలం ఏప్రిల్ 9వ తేదీన ముగిసింది. సాధారణంగా పార్టీ కోటాలో సభ్యత్వం ముగిసిన తర్వాత తిరిగి పార్టీ టికెట్‌పైనే వస్తుంటారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఆయన సేవలను ప్రత్యేకంగా గుర్తించి రాష్ట్రపతి కోటా ద్వారా నేరుగా సభకు పంపడం గమనార్హం. రాజ్యసభ 13వ డిప్యూటీ ఛైర్మన్‌గా ఆయన పనిచేసిన తీరు అమోఘం. క్లిష్టమైన బిల్లుల చర్చ సమయంలో సభలో గందరగోళం నెలకొన్నప్పుడు, ఆయన చూపిన ప్రతిభ, నిష్పక్షపాత నిర్ణయాలు అధికార, ప్రతిపక్షాల మన్ననలు పొందాయి. హరివంశ్ నారాయణ్ సింగ్‌ను మళ్లీ సభకు పంపడం వెనుక కేంద్ర ప్రభుత్వం కొన్ని కీలక వ్యూహాలను రచించిన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎగువ సభలో ప్రతిపక్షాల బలం గణనీయంగా ఉన్నప్పుడు, సభను సమర్థవంతంగా నడపగలిగే వ్యక్తుల అవసరం ప్రభుత్వానికి ఉంటుంది. హరివంశ్ ఆ విషయంలో ఇప్పటికే తన సత్తా చాటారు. తాజా నామినేషన్‌తో ఆయన మళ్లీ రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యే అవకాశముంది.

నామినేటెడ్ సభ్యుడిగా ఉంటూ ఈ బాధ్యతలు చేపడితే, అది సభకు మరింత గౌరవాన్ని తెస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సీనియర్ జర్నలిస్టుగా హరివంశ్‌కున్న విలువలు, రాజకీయాలకు అతీతంగా ఆయనకు ఉన్న ఆదరణ ప్రభుత్వానికి సానుకూల అంశమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రాజకీయాల్లో హుందాతనం తగ్గుతున్న కాలంలో, హరివంశ్ నారాయణ్ సింగ్ వంటి సీనియర్ల సేవలను వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామమని తెలిపారు. రంజన్ గొగొయ్ స్థానంలో ఓ అనుభవజ్ఞుడైన పార్లమెంటేరియన్ రావడం సభ గౌరవాన్ని మరింత పెంచుతుందనడంలో సందేహం లేదని పేర్కొన్నారు. హరివంశ్ నారాయణ్ సింగ్ మళ్లీ డిప్యూటీ ఛైర్మన్ బాధ్యతలు చేపడితే.. సభలో చర్చల నాణ్యత మరింత మెరుగుపడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# బిజెపితో జగన్ అక్రమ పొత్తు

**– మావిగన్‌పై ఐదేళ్లు ఏమి చేశావ్? : షర్మిల**



**అనంతపురం, ఏప్రిల్ 10 :** బిజెపితో అక్రమ పొత్తు పెట్టుకున్నది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే అని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల విమర్శించారు. ఆ పొత్తులో భాగంగానే పార్లమెంట్‌లో ప్రతి బిల్లుకూ వైసిపి మద్దతు తెలుపుతోందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా అమలు జరపాలని కోరుతూ సిపిఐ చేపట్టిన పాదయాత్రకు మద్దతు తెలిపేందుకు శుక్రవారం ఆమె అనంతపురం వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో షర్మిల మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్లూ మూడు రాజధానులని చెప్పి, ఇప్పుడేమో మావిగన్ అని వైసిపి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బిజెపి మతత్వానికి వ్యతిరేకంగా ఉండాలన్నది వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అభిమతమని, ఆయన వారసులుగా తాము బిజెపికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌లో ఉన్నామని చెప్పారు. ఏదైనా నిర్మించాలి.. కట్టాలి అన్న ఆలోచనే వైసిపికి ఉండదని విమర్శించారు.

## ఏదుల రిజర్వాయర్ భూసేకరణ కోసం ఎంతో కష్టపడ్డా

**మాజీ మంత్రి సింగరెడ్డి నిరంజన్ రెడ్డి**

**హైదరాబాద్,ఏప్రిల్10 :** ఏదుల రిజర్వాయర్ భూసేకరణ కోసం తాను ఎంతో కష్టపడ్డానని, భూమి ఇవ్వాలని రైతుల కాళ్లు మొక్కుతా అని విజ్ఞప్తి చేసినట్లు మాజీ మంత్రి సింగరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పాలమూరు-రంగారెడ్డి లో భాగమైన ఏదుల రిజర్వాయర్ భూసేకరణ కోసం నేనొక్కడినే 73 సార్లు వెళ్లి రైతులను కలిశానని గుర్తు చేశారు.

# ఆపరేషన్ డ్రగ్ ఫ్రీ సిటీపై ఫోకస్

**– రౌడీ షీటర్లకు డ్రగ్ టెస్టులతో విస్తుపోయే నిజాలు**
**– 75 శాతం మంది రౌడీషీటర్లు గంజాయి బానిసలుగా గుర్తింపు**

**హైదరాబాద్, ఏప్రిల్ 10 :** హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణెళి ధ్యేయంగా పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ డ్రగ్ ఫ్రీ సిటీ' ఇప్పుడు పెను సంచలనం సృష్టిస్తోంది. రౌడీషీటర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తీసుకున్న సాహసోపేత నిర్ణయం ఇప్పుడు నేరగాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. భాగ్యనగరంలో పెరుగుతున్న నేరాలకు మత్తు పదార్థాలే కారణమని గుర్తించిన పోలీసులు, రౌడీషీటర్ల పని పట్టేందుకు సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రౌడీషీటర్లను పిలిపించి వారికి డ్రగ్ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహించడంతో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. సీపీ సజ్జనార్ ఆదేశాలతో రౌడీషీటర్లకు డ్రగ్ టెస్టులు నిర్వహించారు. నగరంలో ప్రస్తుతం 1,300 మందికి పైగా రౌడీషీటర్లు ఉన్నారు. వారిలో 250 మందికిపైగా డ్రగ్ టెస్టులు నిర్వహించారు. 190 మందికి గంజాయి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ రౌడీషీటర్లకు గంజాయి ఎక్కడి నుంచి సరఫరా అవుతోంది? దీని వెనుక ఉన్న ప్రధాన ముఠాలు ఎవరు? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పాజిటివ్ వచ్చిన వారిని వెంటనే రీహ్యాబిటేషన్ కేంద్రాలకు తరలిస్తూనే, నగరంలో ఈ మత్తు నెట్‌వర్క్‌ను పూర్తిగా ఛేదించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. నగర ప్రజల భద్రత కోసం ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రౌడీషీటర్లందరినీ నిశితంగా గమనిస్తున్న పోలీసులు, వారి ప్రవర్తనలో మార్పులు రావడానికి ప్రధాన కారణం మత్తు పదార్థాలని తేల్చారు. కమిషనరేట్ పరిధిలో సుమారు 1300 మంది రౌడీషీటర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మొదటి విడతలో సుమారు 250 మందికి డ్రగ్ పరీక్షలు నిర్వహించారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

టెండరు ప్రకటన నం. WAT-TRS-RT-01-2026-27

దాని ప్రదేశంతో పని పేరు:

ఎలక్ట్రిక్ లోకోషెడ్/విశాఖపట్నం వద్ద ఎమర్జెన్సీ బ్రేక్ అప్లికేషన్ సమయంలో BP ట్రైన్ పైప్ నుండి బొగ్గు/ధూళి కణాల సేకరణ కొరకు మూడు ఫేజ్ లలో లోకోమోటివ్స్ (WAP-7 & WAP-9) లో ట్రాప్ చాంబర్ ఫిట్‌మెంట్

టెండరు విలువ: రూ.11,14,606.55, బయానా: రూ.22,300.00, టెండరు డాక్యుమెంట్ ధర: రూ.2,360.00., పని పూర్తి చేయాల్సిన కాలం: 12 నెలలు.

టెండరు ముగింపు తేది మరియు సమయం: 30.04.2026న 1500 గం.

ఈ టెండరుపై మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు, మరియు ఏదేని అట్టి మాన్యువల్ ఆఫర్ అందితే విస్మరించబడును.

పై ఇ-టెండర్ల యొక్క ఇ-టెండరు డాక్యుమెంట్లు సహా పూర్తి సమాచారం http:// www.ireps.gov.in వెబ్‌సైట్ లో లభిస్తుంది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (TRS)/ విశాఖపట్నం

PR-37/R/26-27

# నేటి మనదేశమ్ సంపాదకీయం

## మహిళా బిల్లుతో పాటు.. సమాజ రుగ్మతలపైనా చర్చించాలి !

భారతదేశం స్వాతంత్ర్యం సముపార్జించి 80వ ఏట అడుగిడబోతున్నాం. సాధించిన విజయాలకన్నా అపజయాలే ఎక్కువగా చర్చించుకోవాలి. దేశంలో నేటికి సరైన విద్యావైద్యం అందడం లేదు. పేదలు పేదలుగానే జీవిస్తున్నారు. గృహవసతి అందని ద్రాక్షగా మారింది. విద్య డబ్బున్న వారికే అందుబాటులో ఉంది. విద్యకోసం మధ్యతరగతి, పేదలు అప్పులు చేయాల్సి వస్తోంది. సరైతన వైద్యం అందుబాటులోకి రావడం లేదు. కనీసం జిల్లాకో మంచి కార్పోరేట్ తరహా ఆస్పత్రి కట్టలేకపోయారు. ఫీజు రియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలకు వేలకోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వాలు సొంతంగా ఆస్పత్రులను నిర్మించలేక పోతున్నాయి. అన్నింటికి మించి గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా వాడేస్తున్నారు. అత్యాచారాలకు లెక్కేలేదు. మహిళల భద్రత డొల్ల అని చెప్పకతప్పదు. అమ్మాయిల అపహరణ కేసులు పెరుగుతున్నాయి. సమజాన్ని పట్టిపపీడిస్తున్న ఈ సమస్యలపై నిరంతరం చర్చించాలి. నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి. ఈ క్రమంలో మహిళల రిజర్వేషన్లను ముందుకు తీసుకెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించేందుకు, ఆమోదిం చేందుకు ఏప్రిల్ 16న పార్లమెంటు సమావేశం కానుంది. దీనికి చట్టబద్ధత కల్పించడం ద్వారా చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు కానున్నాయి. దీంతో ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న మహిళా రిజర్వేషన్ల క ల సాకారం కానుంది. 2029 ఎన్నికల నుంచి ఇది అమల్లోకి రానుంది. భారత్‌లోని కోట్లాది మహిళల ఆకాంక్షలకు ఇది ప్రతిబింబంగా చూడాలి. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమి స్తుందనే మన సుదీర్ఘ నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనం. దేశ జనాభాలో దాదాపు సగం మంది మహిళలే ఉన్నా వారికి ఇన్నాళ్లూ చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం దక్కలేదు. ఈ దేశానికి వారు అందిస్తున్న సేవలు అపారమైనవే కాదు... అమూల్యమైనవి. కూడా. అయినా ఇంకా చిన్నచూపు చూస్తూనే ఉన్నారు. పిల్లను క నే యంత్రాలుగా భావిస్తున్నారు. నిజానికి ప్రతిరంగంలోనూ మహిళలు సాధిస్తున్న అద్భుతమైన విజయాలకు ఎందరో దిక్సూచిగా నిలిచారు. శాస్త్ర, సాంకేతిక రంగాల నుంచి ఔత్సాహిక పారిశ్రామిక రంగం వరకు, క్రీడల నుంచి రక్షణ బలగాల వరకు, సంగీతం నుంచి లలితకళల వరకు దేశాభివృద్ధిలో మహిళలే అగ్రగామిగా ఉన్నారు. కొన్నేళ్లుగా చేసిన ప్రయత్నాలు స్త్రీ సాధికారత దిశగా అనుకూల వాతావరణాన్ని సృష్టించాయి. చదువుకునేందుకు విస్తృతంగా పెరిగిన అవకాశాలు, మెరుగైన ఆరోగ్య సేవలు, విస్తరించిన ఆర్థిక సమ్మిళితత్వం, అందుబాటులోకి వచ్చిన ప్రాథమిక అవసరాలు..ఆర్థిక, సామాజిక కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని విస్తృతం చేశాయి. అయినప్పటికీ.. సమాజంలో మహిళలు పోషిస్తున్న పాత్రకు అనుగుణంగా రాజకీయ రంగంలో, శాసనసభల్లో వారికి తగు ప్రాతినిధ్యం లభించలేదు. ఇది దురదృష్టకరం అని చెప్పుకోవాలి. దాదాపు 80 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం ఇప్పుడు ఈ కల సాకారం కాబోతున్నది. పరిపాలనలో, నిర్ణయాధికారంలో మహిళలు భాగస్వాములైతే.. వారిదైన ఆలోచనలనూ, అనుభవాలనూ జోడించడం ద్వారా ప్రజోపయోగ చర్చలు, పాలనా సామర్థ్యం మరింత మెరుగవు తాయనడంలో సందేహం లేదు. రిజర్వేషన్ల బల్లు ఆఆమోదం దక్కాక రానున్న అంటే... 2029లో లోక్‌సభ, వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగే నాటికి మహిళా రిజర్వేషన్లను అమలుచేయడం ఇక అనివార్యం కానుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలకు దక్కాల్సిన ప్రాధాన్యాన్ని అందించేందుకు గత ప్రభుత్వాలు కూడా దశాబ్దాలుగా తమవంతు ప్రయత్నం చేస్తూ వచ్చాయి. కమిటీలు ఏర్పాటయ్యాయి. ముసాయిదా బిల్లులను ప్రవేశ పెట్టారు. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. అయినప్పటికీ... చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తం అయింది. ఈ ఏకాభిప్రాయ స్ఫూర్తితోనే 2023 సెప్టెంబరులో నారీ శక్తి వందన్ అధీనియంను పార్లమెంటు ఆమోదించింది. భారత చరిత్రలో ఇదో సువర్ణాధ్యాయంగా చెప్పుకోవాలి. మహిళలను శక్తివంతంగా ఎదగడానికి ఇదో ప్రయత్నంగాచూడాలి. వారికి సమున్నత గౌరవం ఇచ్చే చర్యగా భావించాలి. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ అవకాశం మన రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనంగా చూడాలి. ఓ రకంగా ప్రపంచ దేశాలతో పోలిస్తే మనం ఎంతో ముందున్నామని చెప్పుకోవాలి. ఆచరణాత్మక రూపంలో సమానత్వానికి ప్రాతినిధ్యం ఉన్న సమాజాన్ని నిర్మించాలన్న మన రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్షలను నెరవేర్చడంలో భాగంగా చేపడుతున్న ఈ ప్రయత్నం నిజంగా అభినందించదగ్గదే. శాసనవ్యవస్థల్లో మహిళల పాత్రను బలోపేతం చేయడం అంటే వారిని మనం గౌరవించుకోవడమే. వారి శక్తిని దేశానికి ఉపయోగించడమే అవుతుంది. ఒక ఇంటిని ఎలా అయితే మహిళ నిర్మిస్తుందో, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రతి మహిళకు సమాన భాగస్వామ్యాన్ని అందించే సమాజాన్ని నిర్మించడంలో మనమంతా అవకాశం ఇవ్వాలి. నిజానికి ఇది ఎప్పుడో జరగాల్సిన సత్కార్యం. మహిళల ప్రాతినిధ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఇప్పటికే జాప్యం జరిగింది. శాసన వ్యవస్థల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని దశాబ్దాల కిందటే గుర్తించినా అడుగు ముందుకు వేయలేదు. ఈ అంశంపై చర్చించారు తప్ప చట్టం చేయలేదు. జనాభాలో సగ భాగంగా ఉన్న వారి ఆకాంక్షలను మన శాసన వ్యవస్థలు ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు లభించే ఆమోదంలో విస్తృత ఏకాభిప్రాయం ముఖ్యం. ఇక్కడ శశభిషలకు తావు లేకుండా ఏకగ్రీవంగా పార్లమెంట్ దీనిని ఆమోదించి తీరాలి. జాతీయ ప్రయోజనాలే పరమావధి అన్న సంకల్పంతో ముందుకు సాగాలి. భారతీయ మహిళల కోసం చేపడుతున్న ఈ ముఖ్యమైన కార్యక్రమానికి మద్దతు అందించాల్సి బాధ్యత అన్న పార్టీలకు ఉంది. ఇకపోతే ఇదే సందర్భంలో దేశాన్ని పట్టిపీడిస్తున్న కొన్న రుగ్మతలనైనా రూపుమాపేందుకు చర్చించాలి. దేశంలో వేళ్లూనుకు పోయిన కులవ్యవస్తపై చర్చంచాలి. కులాల వారీగా రిజర్వేషన్లు అనేవి ఉన్నా..కులాల ఉమ్ములాటలు ఆగడం లేదు. దేశ ప్రజలంతా సమానమే అన్న భావన రావాలంటే కుల వ్యవస్థను కూకటివేళ్లతో పెరికివేయాలి. ఈ విషయంపైనా ఇటీవల పలువురు ప్రముఖులు చర్చ లేవనెత్తారు. రాజకీయ పార్టీలు దూరదృష్టితో ఆలోచిస్తే.. ఇదేమంత పెద్ద సమస్య కాబోదు.

---

### మూడుసార్లు గుండె ఆగినా...

# కిమ్స్ వైద్యుల పోరాటంతో ప్రాణాలు దక్కించుకున్న మహిళ



- వెంట్రిక్యులర్ టాకీకార్డియా, వీఎఫ్, మూత్రపిండాల వైఫల్యం, కుచించిన ఊపిరితిత్తిలు
- మల్టీస్పెషాలిటీ, ఐసీయూ నిపుణుల అప్రమత్తతతో సాధ్యమైన అరుదైన విజయగాథ

**విశాఖపట్నం ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఆస్పత్రిలో చేరిన మహిళకు వరుసగా మూడుసార్లు గుండె ఆగినా, సమయానికి అందించిన అత్యవసర చికిత్స, ఐసీయూ నిపుణుల అప్రమత్తత, మల్టీ స్పెషాలిటీ వైద్యుల సమన్వయంతో ప్రాణాలు కాపాడిన అరుదైన ఘటన విశాఖపట్నం సీతమ్మధార కిమ్స్ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు ఐసియు చీఫ్ డాక్టర్ ఐ. రామకృష్ణ మరియు ఫిజిషియన్ డా. బి.వి.ఎన్ రావు.

విశాఖపట్టణానికి చెందిన ఓ 62 ఏళ్ళ దయాబెటిస్ తో బాధపడుతూ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నల్లటి మల విసర్జన, ఆహారం తీసుకోలేకపోవడం వంటి సమస్యలతో జనవరి నెల 21వ తేదీన కిమ్స్ హాస్పిటల్స్ సీతమ్మధారలో చేరింది. ఆస్పత్రికి వచ్చేసరికి ఆమె షాక్‌లో ఉండటంతో నోరాడ్రినలిన్ సపోర్ట్ అవసరమైంది. పరీక్షల్లో హిమోగ్లోబిన్ 6.4 గ్రాములు, క్రియాటినిన్ 3.2గా నమోదయ్యాయి. ట్రోపోనిన్ 0.4గా ఉండగా, ఆరు గంటల తర్వాత కూడా అదే స్థాయిలో తర్వాత బిపి అదుపులోకి వచ్చింది. మూత్ర విసర్జన మెరుగు పడటం వంటి లక్షణాలు కనిపించడంతో సమస్య మూలాన్ని గుర్తించేం దుకు ఎండోస్కోపీ నిర్వహిం చారు. అయితే పరీక్ష జరుగు తున్న సమయం లోనే ఆమెకు వెంట్రిక్యులర్ టాకీకార్డియా (వీటీ) రావడంతో ఆకస్మికంగా గుండె ఆగి పోయింది. సీపీఆర్, ఎలక్ట్రిక్ షాక్ సహాయంతో వైద్యులు ఆమెను కాపాడం. అక్కడితో ప్రమాదం ముగియలేదు. ఐసీయూకు తరలించిన తర్వాత మరోసారి గుండె ఆగిపోవడంతో మళ్లీ అత్యవసర చికిత్స అందించి ప్రాణాలు నిలబెట్టారు. అనంతరం రెండు రోజుల తర్వాత మూడోసారి కార్డియాక్ అరెస్ట్ సంభవించగా, మరోసారి షాక్ చికిత్సతో విజయవంతంగా కాపాడారు. ఇంతటి ప్రాణాపాయ పరిస్థితులు ఎదురైనా ఆమె స్పృహలో ఉండటం, వైద్యుల ఆదేశాలకు స్పందించడం వైద్య బృందానికే ఆశ్చర్యం కలిగించింది. అయితే ఐసీయూ ప్రయాణం అక్కడితో ముగియ లేదు. దీర్ఘకాలం వెంటిలేటర్ సపోర్ట్ అవసరమైంది. కిడ్నీ పనితీరు దెబ్బతినడంతో దయాలసిస్ కొనసాగింది. ఎన్‌టి-ప్రోబీ ఎన్‌పీ 30 వేలకుపైగా ఉండగా, 2డీ ఎకో పరీక్షలో గుండె కండరాల కదలికలో లోపాలు, స్వల్ప ఎల్వీ డిస్‌ఫంక్షన్ (ఈఎఫ్ సుమారు 47 శాతం) ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. 48 గంటలపాటు పరీక్షించి చికిత్సనందించిన చేయాల్సి వచ్చింది. ఎడమ ఊపిరితిత్తి కుంచించుకుపోవడం మరో సవాలుగా మారింది. చివరకు ట్రాకియోస్టమీ చేయాలని వైద్యులు నిర్ణయించారు. ట్రాకియోస్టమీ అనంతరం ఆమెకు శ్వాసలో సౌలభ్యం పెరిగి, వెంటిలేటర్ నుంచి తొలగించాం. వెంటిలేటర్ మీద ఉన్న రోగిని సొంతగా ఎటువంటి సహాయం లేకున్నా శ్వాస తీసుకునే స్థితికి తీసుకొని రావటం, ఐసీయు డాక్టరుకు గట్టి సవాలతో కూడుకున్న విషయం. ఈ కేసులో అది ఇంకా చిక్కుముడితో కూడుకున్న పని. ప్రతీ రోజూ వెంటిలేటర్ నుంచి తీసే ప్రయత్నం చేస్తూ, ఊపిరితిత్తులకు సంబంధించిన కండరాల వ్యాయామం క్రమం తప్పకుండా చేయించటం, ఇన్ఫెక్షన్ బారినుండి కాపాడటం జరిగింది. ఇంతటి పోరాటం చేసిన తర్వాత పేషెంట్ సొంతగా గాలి తీసుకోవడం ప్రారంభించడంతో, అన్ని రకాల జాగ్రత్తలు తీసుకొని, డీకాన్యులేషన్ చేసారు. అది చేసిన తర్వాత ఆమె ఆరోగ్యం మరింత మెరుగుపడిన తర్వాత డిశ్చార్జ్ చేశాం. ఎంతో సహనంతో, ఎన్ని అవాంతరాలు వచ్చినా, చివరి వరకు పట్టు విడవకుండా, ప్రతీ ఒక్క డాక్టరు పరీక్షించి, కలిసిగట్టుగా పోరాడి అంతిమంగా విజయం సాధించారు. ఈ చికిత్సలో కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డా. మహేస్, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డా. చలపతి రావు, డా. శ్రీనివాస్, నెఫ్రాలజిస్ట్ డా. ఆర్.కె. మహేష్, డా. చరణ్, పల్మోనాలజిస్ట్ డా. భరత్, ఈఎన్‌టీ సర్జన్ డా. దిలీప్, న్యూరాలజిస్ట్ డా. రోహిత్, ఐసీయూ వైద్యులు డా. గంగాధర్, డా. కౌసల్య, డా. రమ్య, డా. మోహన్ సాయి, అనస్థీషియా విభాగాల వైద్యులు సమిష్టిగా కృషి చేశారని తెలిపారు.

---

## కొత్తగా ప్రవేశపెడుతున్న హమ్సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలకు విశాఖ డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు

### చలసాని గాంధీకి హృదయపూర్వక స్వాగతం



**విశాఖపట్నం ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** విశాఖపట్నం డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (DRUCC) సభ్యులు శ్రీ చలసాని గాంధీ, తిరుపతి - శ్రీకాకుళం రోడ్ మధ్య కొత్తగా ప్రవేశపెడుతున్న హమ్సఫర్ ఎక్స్‌ప్రెస్ (17439/17440) రైలు సేవలను హృదయ పూర్వ కంగా స్వాగతించారు.రైల్వే శాఖ ప్రకటించిన ప్రకారం, ఈ రైలు ఏప్రిల్ 13 నుండి ప్రారంభమై ప్రతి ఆదివారం తిరుపతి నుండి, ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్ నుండి నడవనుంది. ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సుఖవంత మైన ప్రయాణాన్ని అందించనున్న ఈ సేవ, రెండు ప్రాంతాల మధ్య ప్రయాణ సౌలభ్యాన్ని మరింత మెరుగు పరుస్తుందని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా శ్రీ చలసాని గాంధీ రైల్వే శాఖకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఉత్తరాంధ్ర ప్రజల తరఫున ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కొత్త రైలు సేవ ప్రాంతీయ అభివృద్ధికి తోడ్పడటమే కాకుండా, భక్తులు, విద్యార్థులు, ఉద్యోగులు సహా వివిధ వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని పేర్కొన్నారు.అయితే, ప్రస్తుతం దువ్వాడ మీదుగా నడవనున్న ఈ రైలును ఉత్తరాంధ్ర ముఖ ద్వారమైన విశాఖపట్నం మీదుగా నడిపితే మరింత మంది ప్రయాణికులకు ఉపయోగ కరంగా ఉంటుందని ఆయన అభిప్రాయ పడ్డారు. విశాఖపట్నం - తిరుపతి మధ్య ఇప్పటికే నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని, రెండో రైలు కోసం చాలా కాలంగా ప్రజల నుండి డిమాండ్ ఉన్నదని గుర్తు చేశారు.కాబట్టి, కొత్తగా ప్రవేశపెడుతున్న హమ్సఫర్ ఎక్స్ ప్రెస్‌ను విశాఖపట్నం మీదుగా మళ్లిస్తే, ప్రయా ణికుల రద్దీ తగ్గి, మరింత సౌకర్యవంతమైన సేవ అందించవచ్చని శ్రీ చలసాని గాంధీ తన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

---

## పౌష్టికాహారంతోనే పిల్లల్లో మానసిక ఎదుగుదల

### సిడిపిఓ సుగుణ



**అనంతగిరి ఏప్రిల్ 10 నేటి మనదేశమ్ :** గర్భిణీలు బాలింతలు 6 సంవత్సరంలోపు పిల్లల్లో పౌష్టికాహారంతోనే శారీరకంగా మరియు మానసికంగా అభివృద్ధి చెందుతారని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని సుగుణ అన్నారు. అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం పూర్తిస్థాయిలో అందిస్తే జీవితములో మొదటి ఆరు సంవత్స రాలు పిల్లల మెదడును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయవచ్చని సిడిపివో తెలిపారు. దీనికోసం గర్భిణీ స్త్రీలలో బాలింతల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వము ఆదేశాల మేరకు ఈనెల 9 తేదీ నుండి 23 తారీకు వరకు పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి అంగన్వాడీ కార్యకర్త ఈ కార్యక్రమాన్ని వారు అంగన్వాడీ సెంటర్ పరిధిలో నిర్వహించి తల్లుల్లో అవగాహన కల్పించాలన్నారు. స్థానికంగా దొరికే ఆకుకూరలు పప్పు దినుసులతో పాటు అంగన్వాడి కేంద్రంలో అందించే పౌష్టికా హారాన్ని తప్పక తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ వెంకటలక్ష్మి, సూపర్వైజర్స్ సంతోష్ కుమారి, సరస్వతి, లక్ష్మి కుమారి, అంగన్వాడీ కార్యకర్తలు కమిడి లక్ష్మి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.




---

## విజయనగరంలో కళ్యాణ్ జ్యువెలర్స్ నూతన షోరూమ్ తో ఆంధ్రప్రదేశ్‌లో మరింత బలోపేతమవుతున్న కళ్యాణ్ జ్యువెలర్స్

- కళ్యాణ్ జ్యువెలర్స్ అండ్ కాండర్ షోరూమ్‌ను ఆదివారం, ఏప్రిల్ 12న ప్రారంభించనున్న ప్రముఖ హీరోయిన్ శ్రీ లీల

**విజయనగరం, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** భారతదేశంలో అత్యంత విశ్వసనీయమైన ప్రముఖ బంగారు, వజ్రాభరణాల సంస్థ కళ్యాణ్ జ్యువెలర్స్ ఆంధ్రప్రదేశ్ లో తమ వ్యాపార విస్తరణకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 12 న విజయనగరంలో నూతన షో రూమ్ ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. విజయనగరంలోని మహాత్మా గాంధీ రోడ్డులో నూతన షోరూమ్‌ను రానున్న ఆదివారం (ఏప్రిల్ 12న) సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభోత్సవం జరుగనున్నట్టు వెల్లడించింది. ప్రముఖ నటి శ్రీలీల చేతల మీదుగా ఈ ప్రారంభోత్సవం జరుగనున్నట్టు తెలిపింది. ఈ సందర్భంగానే కళ్యాణ్ లైఫ్‌స్టైల్ జ్యువెలరీ బ్రాండ్ అయిన కాండెరే షోరూమ్‌ను కూడా ప్రారంభిస్తున్నట్టు పేర్కొన్నది. ఈ నూతన షోరూమ్ కళ్యాణ్ జ్యువెలర్స్ వ్యూహాత్మక విస్తరణలో ఒక ముఖ్యమైన అడుగని వెల్లడించింది. బంగారం, వజ్రాలు, విలువైన రత్నాలతో కూడిన విస్తృత ఆభరణాల కలెక్షన్‌ను వినియోగదారులకు మరింత చేరువలోకి తీసుకురావడమే తమ లక్ష్యమని వెల్లడించింది. విజయనగరంలో వస్తున్న ఈ ఆధునిక షోరూమ్ ప్రపంచ స్థాయి షాపింగ్ అనుభవాన్ని అందిస్తూ, కంపెనీకి చెందిన ప్రముఖ బ్రాండ్ల డిజైన్లను విస్తృతంగా ప్రదర్శిస్తుందని పేర్కొన్నది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళ్యాణ్ జ్యువెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కళ్యాణ రామన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కళ్యాణ్ జ్యువెలర్స్‌కు కీలకమైన మార్కెట్ అని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో తమ సంస్థ విస్తరణ తమ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. వినియోగదారులకు అవసరమైన షాపింగ్ అనుభవాన్ని మెరుగుపరిచే సమగ్ర వ్యవస్థను సృష్టించడానికి తాము నిరంతర వ్యూహాత్మక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. తమ నూతన షోరూమ్ కళ్యాణ్ బ్రాండ్‌ను మరింత మంది వినియోగదారులకు చేరువ చేస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నూతన షోరూమ్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని కళ్యాణ్ జ్యువెలర్స్ వాల్యూ అడిషన్ పై (పరిమితకాలానికి )50 శాతం వరకు ప్రత్యేక రాయితీని అందిస్తోంది. దీనితో పాటు అదనంగా కళ్యాణ్ ప్రత్యేక గోల్డ్ బోర్డ్ రేట్ ద్వారా మార్కెట్ రేట్లకన్నా తక్కువ ధరకే బంగారాన్ని వినియోగదారులు పొందవచ్చు. కళ్యాణ్ జ్యువెలర్స్‌లోని ప్రతి ఆభరణం దీxూ హాల్‌మార్క్‌తో ఉంటుంది. వివిధ స్థాయిల్లో స్వచ్ఛత తనిఖీలకు లోబడి వినియోగదారులకు ప్రత్యేకంగా 4 దశల అష్యూరెన్స్ సర్టిఫికేట్ కూడా అందించబడుతుంది.ప్రధానంగా ఇందులో బంగారం స్వచ్ఛత హామీ, జీవితకాల ఉచిత నిర్వహణ, ఉత్పత్తి వివరాలు పారదర్శకమైన మార్పిడి, తిరిగి కొనుగోలు విధానాలు ఉంటాయని సంస్థ వెల్లడించింది. ఈ హామీల్లో కళ్యాణ్ జ్యువెలర్స్ తమ వినియోగదారులకు అత్యుత్తమ నాణ్యత, విశ్వాసాన్ని అందించాలనే నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

---

## బిజెపి మండల అధ్యక్షుడిగా నీలాపు సురేష్ రెడ్డి



**భీమునిపట్నం, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** మండలంలో భారతీయ జనతా పార్టీకి చెందిన ప్రముఖ నాయకుడు నీలాపు సురేష్ రెడ్డి ని మండల అధ్యక్షుడిగా నియమించడం జరిగింది. ఈ నియామకాన్ని జిల్లా అధ్యక్షులు ఎమ్.ఎమ్.ఎన్ పరశురామ రాజు మరియు భీమిలి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ జీరు కైలాస్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు.ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తూ, సురేష్ రెడ్డి నాయకత్వంలో తగరపువలస మండలంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ఆయన పార్టీ పట్ల చూపిన నిబద్ధత, కృషి కారణంగా ఈ బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు పేర్కొన్నారు.సురేష్ రెడ్డి మాట్లాడుతూ, తాను బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని చెప్పారు.

అలాగే కార్యకర్తలతో కలసి పనిచేసి పార్టీని మరింత బలపరచడం తన ముఖ్య లక్ష్యమని తెలిపారు.

# చాక్లెట్స్‌పై చేదు కబురు

## డార్క్ చాక్లెట్ బార్స్ సహా పలు ప్రొడక్ట్స్‌లో హానికారక మెటల్స్




వాతావరణ కాలుష్యం అటుంచి ఏం తినాలన్నా కల్తీమయమవుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. పిల్లలు ఇష్టంగా తినే చాక్లెట్స్‌లోనూ ప్రమాదకర పదార్థాలున్నాయని తాజా సర్వేబాంబు పేల్చింది.

న్యూఢిల్లీ : బయటకు అడుగుపెడితే వాతావరణ కాలుష్యం కోరలు చాస్తుంటే ఇక ఏం తినాలన్నా ఆహారం కల్తీమయమవుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. పిల్లలు ఇష్టంగా తినే చాక్లెట్స్‌లోనూ ప్రమాదకర పదార్థాలున్నాయని తాజా సర్వే బాంబు పేల్చింది. డార్క్ చాక్లెట్ బార్ సహా పలు చాక్లెట్స్‌లో మెటల్ కంటెంట్ అధికంగా ఉంటోందని వెల్లడైంది. లీడ్, కాడ్మియం వంటి పదార్థాలు వీటిలో ఉన్నాయని, దీర్ఘకాలం వీటిని వాడితే తీవ్ర అనారోగ్య సమస్యలు వెంటాడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇక కేవలం మిల్క్ చాక్లెట్ బార్స్‌లోనే అధికంగా లోహాలు లేవని వెల్లడైంది. తాము పరీక్షించిన చాక్లెట్ ఉత్పత్తుల్లో మూడింట ఓ వంతు చాక్లెట్స్‌లో లీడ్, కాడ్మియమ్ లెవెల్స్ ఆందోళనకరంగా ఉన్నాయని గుర్తించామని లాభాపేక్ష లేని వినియోగదారుల సలహా మండలి కన్జ్యూమర్ రిపోర్ట్స్ పరిశోధన తెలిపింది. అమెరికాలో అతిపెద్ద చాక్లెట్ తయారీ కంపెనీ హెర్షీని తమ ఉత్పత్తుల్లో ఈ హెవీ మెటల్స్ వాడకాన్ని తగ్గించాలని సంస్థ కోరింది.

# కరివేపాకుతో బిపి కంట్రోల్



రోజూ కూరల్లో రుచికి, సువాసన కోసం వేసుకునే కరివేపాకు వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా కరివేపాకు వల్ల బిపి కంట్రోల్ అవుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

– కరివేపాకులో పొటాషియం ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అందుకే కరివేపాకును తీసిపారే యకుండా తింటే మంచిది.

– కూరల్లో మాత్రమే కాకుండా.. కరివేపాకు టీని తయారుచేసుకని తాగినా ఆరోగ్యానికి మంచిదే. లేదా ఎండిన కరివేపాకులను వేడినీటిలో ఉడికించి ఆ నీటిని వడగట్టి తాగితే బిపి కంట్రోల్ అవుతుంది.

– కరివేపాకు చట్నీ లేదా కరివేపాకు పొడిని రెగ్యులర్‌గా అన్నంలో వేసుకుని తింటే బిపి కంట్రోల్ అవుతుంది.

# అల్పాహారం 8 గంటల్లోపే



ఏం తింటున్నామనేదే కాదు, ఎప్పుడు తింటున్నామన్నదీ ముఖ్యమే. ఉదయం అల్పాహారం విషయంలో దీనికి మరింత ప్రాధాన్యముందని ఐఎస్‌గ్లోబల్ అధ్యయనం పేర్కొంటోంది. ఉదయం 9 గంటల తర్వాత అల్పాహారం చేసినవారితో పోలిస్తే ఉదయం 8 గంటల్లోపే టిఫిన్ తిన్నవారికి మధుమేహం ముప్పు 59% వరకు తగ్గుతున్నట్టు తేలింది మరి. అనారోగ్యకరమైన ఆహారం, శారీరక శ్రమ చేయకపోవటం, పొగ తాగటం వంటి కారకాలు టైప్ 2 మధుమేహం ముప్పు పెరిగేలా చేస్తుంటాయి. వీటికిప్పుడు మరోటీ జోడించుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. అదే ఆహారం తినే సమయం. నిజంగానే తిండి వేళలు జీవ గడియారం (సర్కేడియన్ రిథమ్), రక్తంలో గ్లూకోజు, కొలెస్ట్రాల్ మోతాదుల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే కొన్ని అధ్యయనాలే తిండి వేళల మీద దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో ఆహార వేళల మధ్య ఎడమ, తినే సమయం, టైప్2 మధుమేహం మధ్య సంబంధాన్ని గుర్తించటానికి ఐఎస్‌గ్లోబల్ పరిశోధకులు ప్రయత్నించారు. మొత్తం 1,03,312 మంది ఆహార అలవాట్లను విశ్లేషించారు. తొలి రెండేళ్ల సగటు ఆహార పద్ధతుల ఆధారంగా ఏడేళ్లకు పైగా వారి ఆరోగ్య తీరుతెన్నులను పరిశీలించారు. వీరిలో కొత్తగా 963 మంది మధుమేహం బారినపడగా.. రోజూ ఉదయం 9 గంటల తర్వాత అల్పాహారం చేసినవారికి ముప్పు గణనీయంగా ఎక్కువగా ఉంటున్నట్టు తేలింది. శారీరకంగా చూస్తే ఇది సబబే. ఎందుకంటే అల్పాహారం మానేయటం వల్ల గ్లూకోజు, కొలెస్ట్రాల్ నియంత్రణ గతి తప్పుతుంది. ఇన్సులిన్ హార్మోన్ మోతాదులూ అస్తవ్యస్తమయ్యే అవకాశమూ ఉంది. అల్పాహారమే కాదు. రాత్రి భోజనం ఆలస్యంగా చేసేవారికీ.. అంటే రాత్రి 10 గంటల తర్వాత తినేవారికీ మధుమేహం ముప్పు పెరుగుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. తక్కువ తక్కువగా రోజుకు ఐదు సార్లు తినేవారికైతే ముప్పు తగ్గుతున్నట్టు బయటపడింది. అలాగే ఎక్కువసేపు ఉపవాసం ఉన్నవారి విషయంలోనూ ఉదయం 8 గంటల్లోపు అల్పాహారం, పెందలాడే రాత్రి భోజనం చేస్తేనే మంచి ఫలితం కనిపిస్తున్నట్టు తేలటం గమనార్హం. రోజులో తొలి ఆహారం ఉదయం 8 గంటల్లోపు, రాత్రి ఆహారం సాయంత్రం 7 లోపు చేస్తే మధుమేహం ముప్పు తగ్గటానికి తోడ్పడుతున్నట్టు ఈ అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయని పరిశోధకులు వివరిస్తున్నారు. ఇలాంటి ఆహార పద్ధతితో రొమ్ము, ప్రొస్టేట్ క్యాన్సర్ ముప్పు తగ్గుతున్నట్టూ ఐఎస్‌గ్లోబల్ గతంలో నిర్వహించిన అధ్యయనంలోనూ వెల్లడైంది. మొత్తమ్మీద మధుమేహం, ఇతర సమస్యల నివారణకు ఆహారం, జీవ గడియారం, ఆరోగ్యం మధ్య సంబంధం (క్రోనో న్యూటిషన్) బలమైన ప్రభావం చూపుతున్నట్టు రుజువవుతోంది.

## రాత్రిపూట పెరుగు తింటున్నారా?

# ప్రమాదమే!




రాత్రిపూట భోజనంలో పెరుగు తీసుకుంటున్నారా? అయితే ప్రమాదమే అంటున్నారు వైద్యులు. పెరుగు తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. పెరుగులో కాల్షియం ఉంటుంది. దీన్ని రోజూ తీసుకుంటే ఎముకల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. అలాగే రోగనిరోధక శక్తిని పెంచుతుది. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలున్న పెరుగును అజీర్తి సమ్యలున్నవారు రాత్రిపూట తినకుండా ఉంటేనే మంచిది అని వైద్యులు సలహా ఇస్తున్నారు. అయితే మరి ఏ సమయాల్లో పెరుగు తినాలి అని సందేహిస్తున్నారా? ఉదయం లేదా మధ్యాహ్నం వేళల్లో పెరుగు తింటే ఆరోగ్యానికి మంచిదని వైద్యులు చెబుతున్నారు.

– మూత్రపిండాల సమస్యలున్నవారు, అధిక బరువుతో బాధపడేవారు పెరుగును మితంగా తీసుకోవాలి. అలాగే పాలతో తయారుచేసే పదార్థాలను తింటే అలెర్జీ సమస్యలు వస్తుంటే.. వారు తప్పనిసరిగా పెరుగు తినకుండా ఉంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

# లవంగ టీతో ఈ సమస్యలకు చెక్!






వాతావరణం కాస్త చల్లబడితే కొందరు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. ముఖ్యంగా కఫం పట్టి జలుబు, దగ్గు వంటి రుగ్మతలు చుట్టు ముడతాయి. అలాంటి వాటికి లవంగ టీతో చెక్ పెట్టొచ్చని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. లవంగాలు, చిన్న అల్లంముక్క, దాల్చిన చెక్క తీసుకుని రెండు కప్పుల నీళ్లు పోసి బాగా మరిగించి తర్వాత వడకట్టాలి. ఆ నీరు గోరువెచ్చగా మారిన తర్వాత అర చెంచా తేనే కలిపి తీసుకుంటే కఫం నుంచి ఉపశమనం కలుగుతుందని చెబుతున్నారు.

### డెంగ్యూ నుంచి త్వరగా కోలుకోవాలంటే..?!

ప్రస్తుతం డెంగ్యూ జ్వరాలు వణికిస్తున్నాయి. పిల్లల నుండి పెద్దల వరకు డెంగ్యూ బారిన పడి ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. డెంగ్యూ జ్వరం ఎర్ర రక్తకణాల ఉత్పత్తిని తగ్గిస్తుంది. దీనివల్ల పరిస్థితి మరింత తీవ్రతరమై ప్రమాదకరమవుతుంది. అయితే తగు జాగ్రత్తలు తీసుకుంటే డెంగ్యూ నుంచి త్వరగా కోలుకునే అవకాశం ఉంది. మరి ఏ ఆహారాలు తీసుకుంటే త్వరగా కోలుకుంటారో తెలుసుకుందామా..!

**ఐరన్ రిచ్ ఫుడ్స్ :** డెంగ్యూ జ్వర పీడితులు ముందుగా ఐరన్ అధికంగా ఉండే పండ్లు, కూరగాయలను తీసుకోవాలి. మాంసం, చేపలు, బీన్స్, ఆకుకూరలు, పప్పులు, ఖర్జూరం మొదలైన వాటిలో ఈ ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఈ రకమైన ఆహారాలను రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే మంచిది.

**విటమిన్ సి :** విటమిన్ సి పుష్కలంగా ఉండే సిట్రస్ ఫ్రూట్స్, కివీ, బెర్రీలు, బ్రకోలీ, టమాటాలు వంటి వాటిని ఎక్కువగా తీసుకుంటే డెంగ్యూ నుండి త్వరగా బయటపడటానికి సహాయపడతాయి.

విటమిన్ సి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి, ఇన్ఫెక్షన్లను వేగంగా ఎదుర్కోవడానికి కూడా సహాయపడుతుంది. ఇవే కాకుండా ప్రోటీన్ ఆహారాలు, తృణ ధాన్యాలు తీసుకుంటే డెంగ్యూ నుంచి త్వరగా కోలుకుంటారు.



# ఈ ఆకులో ఇన్నున్నాయా..!



బిర్యానీ.. పేరు చెబితే చాలు మన ముఖం వెలిగిపోతుంది. నోట్లో నీళ్లూరతాయి. నవాబుల హైదరాబాదీ బిర్యానీ దగ్గర్నుంచి.. కుండ బిర్యానీ వరకూ ఏదైనా సరే.. ఎప్పుడెప్పుడు తిందామా అన్నంత ఊరిస్తుంది. ఆ ఘుమఘుమలకు అసలైన కారణం బిర్యానీ ఆకు. ఇది పేరుకు బిర్యానీ ఆకే అయినా.. కిచిడీ, ఫ్రైడ్ రైస్, మసాలా కూరల్లోనూ వేసి.. వాటి రుచి మరింత పెరిగేలా చేస్తాం. ఇది సువాసనలు గుప్పించడమే కాదండోయ్.. ఇందులో బోలెడన్ని ఔషధ గుణాలూ ఉన్నాయి. మొట్టమొదట ఆ సువాసన.. నోట్లో ద్రవాలు ఊరించి, తినాలనిపించేలా చేస్తుంది. ఇది జీర్ణ ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఆకలిని పెంచుతుంది. మధుమేహం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. శ్వాసకోశ సమస్యలను, ఫంగల్ ఇన్ఫెక్షన్లను, క్యాన్సర్లను నివారిస్తుంది. సూక్ష్మక్రిములను నశింపచేస్తుంది. జుట్టు పెరిగేందుకు తోడ్పడుతుంది. గుండె, మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మానసిక ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్స్ రోగనిరోధక శక్తిని పెంచుతాయి. నొప్పి, వాపు, మంటలు తగ్గుతాయి. బిర్యానీ ఆకులో ఎన్ని సుగుణాలో కదూ!

# కోడి పెట్టని గుడ్డు



మనలో కొందరు పూర్తి శాకాహారులుంటారు. చేపలు, మాంసాలే కాదు పశువుల నుంచి వచ్చిన పాలు, గుడ్లు కూడా తీసుకోరు. అలాంటి వారి కోసం వేగన్ చికెన్, మటన్‌లు వచ్చాయి. ఇప్పుడు కొత్తగా 'వేగన్ ఎగ్' కూడా వచ్చేసింది.

పప్పులు, పనీర్, సుగంధ ద్రవ్యాలతో తయారయ్యే ఈ రకమైన గుడ్లు అచ్చం కోడిగుడ్లలానే ఉంటాయి. అసలైన గుడ్లను, వీటిని కలిపి ఉంచితే తేడా బొత్తిగా కనిపెట్టలేం. ఇంతకీ ఈ కృత్రిమ గుడ్డును ఎలా చేస్తారంటే.. శనగపప్పును గ్రైండ్ చేసి పెరీపెరీ మసాలా, మ్యాగీ మసాలా, కొద్దిగా నూనె, కొన్ని నీళ్లు, కాస్త పసుపు కలిపిన మిశ్రమంతో గుడ్డు లోపల ఉండే పచ్చ సొనను చేస్తారు. మళ్లై కోవాలో మొక్కజొన్న పిండి, రాక్ సాల్ట్ వేసి బాగా కలిపి.. తెల్ల భాగం చేసి, మధ్యలో శనగపప్పుతో చేసిన మిశ్రమాన్ని ఉంచి.. గుడ్డు ఆకృతి ఇస్తారు. ఈ కృత్రిమ గుడ్డును ఉడకబెట్టడానికి రాక్‌సాల్ట్ నీళ్లే ఉపయోగించాలి. ఇది సరిగ్గా ఐదు నిమిషాల్లో ఉడికిపోతుంది. రుచికీ, పోషకాలకూ కూడా సాధారణ గుడ్డుతో సమానమే అంటున్నారు. బాగుంది కదూ! నవంబరు 1 'ప్రపంచ వేగాన్ దినోత్సవం'. ఈ సందర్భంగా అచ్చమైన శాకాహారం తినాలనుకుంటే.. కోడితో సంబంధం లేని ఈ గుడ్డు చేసి చూడండి!

# షెజ్వాన్ ఫ్రైడ్ రైస్ మరింత రుచిగా..



మా అబ్బాయికి షెజ్వాన్ ఫ్రైడ్ రైస్ అంటే చాలా ఇష్టం. దీన్ని హోటల్ పద్ధతిలో రుచిగా చేయడం ఎలా?

షెజ్వాన్ ఫ్రైడ్ రైస్‌కి బాస్మతి బియ్యం బాగుంటాయి. సమయానికి బాస్మతి లేకుంటే.. సోనా మసూరి లేదా చిట్టి ముత్యాలు (జాస్మిన్ రైస్) లాంటి నాణ్యమైన బియ్యం వాడండి.

ఎసరు మరుగుతున్నప్పుడు నానబెట్టిన బియ్యం, కొంచెం ఉప్పు వేసి, 80% ఉడికించి, నీరు వార్చేస్తే మెత్తపడదు. ఆ అన్నాన్ని నూనె రాసిన పళ్లెంలో లేదా జల్లెడలో వేసి ఆరబెడితే పొడిపొడిగా ఉంటుంది. అన్నంలో కలిపే షెజ్వాన్ సాస్ రుచి.. మీరు తీసుకున్న మిరపకాయల నాణ్యత మీద ఆధారపడి ఉంటుంది. కనుక సాస్ ఇంట్లో తయారుచేస్తున్నట్లయితే.. దానికి అవసరమైనవన్నీ మేలైనవి ఉపయోగించండి. మార్కెట్లో దొరికేవి.. ఆయా బ్రాండ్స్‌ను బట్టి రుచిలో తేడాలుంటాయి. మీకు నచ్చిన బ్రాండ్ గుర్తుంచుకుని.. ఎప్పుడూ అదే వాడండి. చైనీస్ వంటకాలు ఏవైనా సరే.. హై ఫ్లేం మీద.. మధ్యమధ్యలో ఎగరేస్తూ చేసుకుంటేనే మంచి ఘుమాయింపుతో.. చాలా రుచిగా ఉంటాయి.

షెజ్వాన్ రైస్‌లో అనాస పువ్వు పొడి తప్పకుండా వేయాలి. దీని వల్ల మంచి సువాసన, గొప్ప రుచి వస్తాయి. కూరగాయలను కూడా హై ఫ్లేమ్ మీదే వేయించాలి.

70% వేగితే చాలు. అంతకంటే ఉడికితే రుచి తగ్గిపోతుంది. దించే ముందు చిటికెడు పంచదార వేస్తే అదనపు రుచి వస్తుంది.

# ఇంట్లోనే పనీర్ చేసుకుందాం..



మనలో చాలామందికి పనీర్‌ను కొనుక్కోవడం అలవాటు. నిజానికి పనీర్‌ను ఇంట్లోనే తేలిగ్గా చేయొచ్చు. ఎలాగంటే.. రెండు లీటర్ల పాలను మధ్యమధ్యలో కలియ తిప్పుతూ మరిగించాలి. పాలు చిక్కబడ్డాక రెండు చెంచాల నిమ్మరసం వేయాలి. నిమిషంలో పాలు విరిగిపోతాయి. అందులో కాస్త ఉప్పు వేసి.. వడకట్టాలి. నీళ్లన్నీ పోగా.. పెరుగులా మిగిలిన పదార్థాన్ని వస్త్రంలో వేసి చతురస్రాకారం వచ్చేలా సర్ది.. దాని మీద బరువైన వస్తువును ఉంచితే కొద్దిసేపటికి గట్టిపడుతుంది. దాన్ని ముక్కలుగా కట్ చేసి.. ఫ్రిజ్‌లో భద్రపరిస్తే సరిపోతుంది. ఇంట్లో తయారైన ఈ పనీర్‌లో రసాయనాలు ఉండవు కనుక ఎంతో ఆరోగ్యకరం. డబ్బు కూడా ఆదా చేసినట్లవుతుంది.

# ఇంట్లోనే పాప్‌కార్న్!



సినిమాకి వెళ్లామంటే ఇంటర్వెల్లో పాప్‌కార్న్ ఉండాల్సిందే! లేదంటే.. ఏదో వెలితిగా, చప్పగా ఉంటుంది. ఈ పేలాలు థియేటరుకే పరిమితం కాదు. ఇంట్లోనూ ఇష్టంగా తినేస్తాం. అంత ఇష్టమైన పాప్‌కార్న్ బయట కొనుక్కుంటే.. ప్యాకెట్ తెరిచాక వెంటనే తినేయాలి. లేదంటే క్రిస్పీనెస్ ఉండదు, సాగినట్లవుతాయి. అంతకంటే ముఖ్యంగా.. అవి నిలవుండేందుకు రసాయనాలు ఉపయోగిస్తారు. అలాంటి ఇబ్బందులు లేకుండా ఇంట్లోనే చేసుకుంటే బాగుంటుంది కదూ! ఎలాగంటారా.. ఎండు మొక్కజొన్న గింజలు కొన్నిటిని ఒక పాత్రలోకి తీసుకుని.. అందులో ఆలివ్ నూనె లేదా వెన్న, కొంచెం ఉప్పు వేసి కలియ తిప్పాలి. వీటిని అవెన్‌కు అనుకూలమైన పేపర్ బ్యాగ్‌లో వేసి, చివర్లో మూసేయాలి. ఇప్పుడు అవెన్‌లో పెట్టి, నిమిషం పాటు ఉంచితే సరి.. ఘుమఘుమలాడే వేడివేడి పాప్‌కార్న్ సిద్ధం. ఇక తిని ఆనందించడమే తరువాయి.

# నూనె మరకలు మాయమిక!



వంట చేయడం కంటే పొయ్యి గట్టు, వంటింటి గోడలను శుభ్రం చేసుకోవడం చాలా కష్టం. జిడ్డు పేరుకుపోయి ఒక పట్టాన వదలవు. ఈ బాధ నుంచి బయటపడేస్తుంది వాటర్, ఆయిల్ ప్రూఫ్ వాల్ పేపర్. చమురు పట్టే ప్రాంతాల్లో ఈ షీట్‌ను అంటిస్తే సరి.. గోడలూ, గట్టూ ఎంచక్కా నీట్‌గా ఉంటాయి. భోజనాల బల్ల మీద కూడా అతికించవచ్చు. నీటిని పీల్చుకోదు, దుమ్ము, తేమల బాధ ఉండదు. ఈ షీట్‌ను అంటించడం, తుడవటం, తీసేయడం– అన్నీ తేలికే. ఇది పల్చగా ఉంటుంది కనుక అతుకు పెట్టినట్లు కూడా ఉండదు.

## నూతన సివిల్ జడ్జిలకు బార్ అసోసియేషన్ సత్కారం




**గుంటూరు, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** ఇటీవల గుంటూరు జిల్లాకు చెందిన న్యాయవాదులు జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన సందర్భంగా గుంటూరు బార్ అసోసియేషన్ గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో అభినందన సభ నిర్వహించి సన్మానించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ్ చక్రవర్తి హాజరై వారిని సన్మానించి మాట్లాడుతూ జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారు నిరంతరం నాలెడ్జ్ పెంచు కుంటూ, సమాజం మెచ్చుకునే విధంగా మంచి తీర్పులు వెలువరించాలని అన్నారు. కాకుమాను మండలం కొమ్మూరుకు చెందిన ఎస్.కె.రేష్మ మాట్లాడుతూ తాను వ్యవసాయ కుటుంబం నుండి వచ్చానని, తల్లిండ్రులు ఖాసిం, ఫిజీదా, అత్తమామలు ముజావర్, మౌలాలి, కుల్సూమ్ ప్రోత్సాహంతో విజయం సాధించానని చెప్పారు. అలాగే పొన్నూరు కోర్టులో అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్‌గా పనిచేస్తున్న ప్రముఖ న్యాయవాది వట్టికూటి లీలా ప్రసాద్ కుమార్తె వట్టికూటి దివ్యచౌదరి విశాఖ పట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా కాలేజిలో న్యాయ విద్య అభ్యసించి, తండ్రి వద్దే ప్రాక్టీస్ చేస్తూ జూనియర్ సివిల్ జడ్జిగా విజయం సాధించారు. చిలకలూరి పేటకు చెందిన సాతులూరు యమున, గుంటూరు బార్ అసోసియేషన్‌కు చెందిన అవ్వారి వెంకట నాగమహాలక్ష్మి గాయత్రి, బాపట్లకు చెందిన ఇమ్మిడిశెట్టి యలమందరావు, మంగళగిరి బార్ అసోసి యేషన్‌కు చెందిన లోకం సాయిశ్వేత జూనియర్ సివిల్ జడ్జి పోస్టులు పొందారు. వీరందర్నీ బార్ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో గుంటూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మదిరి నాగేశ్వరరావు, కార్యదర్శి వీరమణేంద్ర, ఉపాధ్యక్షురాలు రేవతి, కార్యవర్గ సభ్యులు, న్యాయమూర్తులు విఎవెల్ సత్యవతి, ఆర్.శరత్ బాబు, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు హాజరై వారిని అభినందించారు.

## కార్యకర్తలతో ఎల్ కోట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో సమావేశం

- కార్యకర్తలే పార్టీకి బలమైన పునాది అన్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి
- స్థానిక సంస్థల ఎన్నికల విజయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్న ఎమ్మెల్యే కోళ్ల
- ప్రజల్లోకి సూపర్ సిక్స్ పథకాలు అమలు వాటి ద్వారా వచ్చే లబ్ధి తెలియజేయాలని పిలుపు

**కొత్తవలస (ఎల్.కోట) ఏప్రిల్ 10, నేటి మనదేశం ప్రతినిధి :-** ఎల్.కోట, శృంగవరపుకోట నియోజకవర్గం ఎల్.కోట టిడిపి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నియోజకవర్గ స్థాయి కార్యకర్తలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..

నియోజకవర్గ అభివృద్ధిలోనూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ కార్యకర్తలు పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. అలానే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఆమె హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలలో క్షేత్రస్థాయిలో చేపట్టబోయే సేవా కార్యక్రమాలు, పార్టీ బలోపేతంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకు రావాలని, వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపడతామని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో ఉంచాలని ఆమె పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో పలువురు ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.






## మాజీ సర్పంచులకు సన్మానం



**రౌతులపూడి, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** మండలంలో పదవీ విరమణ పొందిన ఆయా పంచాయతీల మాజీ సర్పం చ్‌లను నియోజక వర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ ముద్ర గడ గిరిబాబు సత్కరించారు. గురువారం వైసిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీలు నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులను సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచులుగా గ్రామాల అభివృద్ధికి చేసిన కృషిని గిరిబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి, వైసిపి మండల అధ్యక్షులు చింతకాయలు వీరవెంకట సత్యనారాయణ, నియోజవర్గ వైసిపి బిసి సెల్ అధ్యక్షులు సర్ణం శ్రీను, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## సౌర విద్యుత్‌తో పర్యావరణానికి మేలు



**కొత్తపేట (కోనసీమ) ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా పర్యావరణానికి ఎటువంటి నష్టం లేకుండా విద్యుత్తు పొందవచ్చని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. ముందుగా బిల్లకుర్రు సబ్‌స్టేషన్ వద్ద మోడేకుర్రు, గొలకోటివారిపాలెం గ్రామాలకు 24 గంటలు త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా చేయడానికి రూ.1.50 కోట్లతో ఏర్పాటుచేసిన 11 కెవి లైన్ ట్రాన్స్ ఫార్మర్లు, 11 కెవి బ్రేకర్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కొత్తపేట గోగువారి పేటలో పిఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ యూనిట్ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సి, ఎస్టి లబ్ధిదారులకు పిఎం సూర్యఘర్ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. పిఎం సూర్య ఘర్ తరపున ఎస్సి, ఎస్టి లబ్ధిదారులకు 2కెవి ఉచిత విద్యుత్ అందించాలనే లక్ష్యంతో, సోలార్ పలకలు ఇంటిపై అమరు స్తున్నారని అన్నారు. దీనితో ఉచిత విద్యుత్ పొందడంతో పాటు ఇంకా విద్యుత్ మిగిల్తే విద్యుత్ సంస్థలకు విక్రయించి ఆదాయం పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. పిఎం సూర్య ఘర్ లో భాగంగా ఎస్సి, ఎస్టి లబ్ధిదారులకు 2కెవి విద్యుత్ సౌకర్యం కల్పనలో భాగంగా రూ.1.50లక్షల ఉచిత సౌర యూనిట్ ఏర్పాటు చేస్తారన్నారు. 2 కెవి కి సుమారు 240 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ఎస్సి, ఎస్టిలు ఈ సౌర యూని ట్‌ను ఉచితంగా పొందవచ్చున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో ఎస్సి, ఎస్టి వర్గాలకు చెందిన వారు ఉచిత విద్యుత్తు 200 యూనిట్లు విని యోగించుకుంటున్న వాళ్ళు మొత్తం 12,243 మందిని గుర్తించారన్నారు.

## మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, ఏప్రిల్ 10 (నేటి మన దేశమ్) :** కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రాజపుడి హై స్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనం పథకం అమలు విధానాన్ని తనిఖీ చేసినట్లు చెప్పారు. విద్యార్థులతో కలిసి స్వయంగా క్యూలైన్‌లో నిలబడిన ఎమ్మెల్యే.. భోజనం పెట్టించు కున్నారు. అనంతరం విద్యా ర్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు అందరూ పాఠశాలలోనే భోజనం చేసేలా నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయుడు, విద్యా కమిటీ ఛైర్మన్ బాజీ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం చేయని పలువురు విద్యార్థులను కారణాలు అడిగి తెలుసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. పాఠశాలలో ఉన్న 540 మంది విద్యార్థులకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ప్లేట్లను అందిస్తామన్నారు.

## ముఖ గుర్తింపు హాజరుపై
### కూలీలు అసహనం



**మక్కువ, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** ఉపాధి హామీ పనిలో ముఖ ఆధారిత హాజరుపై కూలీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల కూలీలకు ఫేసియల్ యాప్ ద్వారా హాజరు సక్రమంగా తీసుకోవడం లేదు. దీంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం మండలం లోని దబ్బగెడ్డలో బసందొరబంద చెరువులో ఈ ఏడాది మొదటిసారిగా ఉపాధి వేతనదారులకు పని కల్పించారు. దాదాపు 250 మంది వేతన దారులు పనికి వెళ్లారు. వీరందరికీ ఫేస్ రికగ్నైజ్డ్ హాజరుకు సిబ్బంది ఉపక్రమిం చినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఇందులో 50 మందికి మాత్రమే హాజరు నమోదయింది. దీంతో మిగిలిన కూలీలు ఉసురుమంటూ వెనుతిరగాల్సి వచ్చింది. ఫలితంగా వేతనదారులంతా ఈ విధానం పై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎపిజివిబి ఖాతాలు ఇవ్వొచ్చుఎపిజివిబి ఖాతాదారులు గతంలో ఉన్న ఖాతా నెంబర్ కాకుండా కొత్తగా 15 అంకెలతో కూడిన కొత్త ఖాతా నెంబర్‌ను పొందుపరచాలని ఉపాధి హామీ సిబ్బంది వేతనదారులకు తెలిపారు. ఏ విధమైన అపోహాలు వద్దని ఈ అకౌంట్లో గతంలో మాదిరిగా డబ్బులు జమవుతాయని వేతనదారులకు భరోసా ఇచ్చారు.

## తప్పుల్లేకుండా మూల్యాంకన ప్రక్రియ జరగాలి : జెసి



**మన్యంజిల్లా, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మూల్యాంకన ప్రక్రియలో ఎలాంటి తప్పులకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి అధికారులను, ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతి మార్కు విద్యార్థి భవిష్యత్తుకు కీలకమని, కోడింగ్, డీకోడింగ్ ప్రక్రియలో ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగకూడదని స్పష్టం చేశారు. పట్టణంలోని డివివిఎం ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి మూల్యాంకన ప్రక్రియను (స్పాట్ వాల్యుయేషన్) జాయింట్ కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వాల్యుయేషన్ కేంద్రంలోని ఉపాధ్యాయులు సమాధాన పత్రాలను దిద్దుతున్న తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిర్దేశించిన సమయంలోగా పారదర్శకంగా మూల్యాంకనాన్ని పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఎండ తీవ్రత దృష్ట్యా మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు అవసరమైన మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు తగినంత గాలి, వెలుతురు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. తనిఖీ కార్యక్రమంలో స్పాట్ వాల్యుయేషన్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ మూల్యాంకన కేంద్రం వద్ద ఫ్యాప్టో నిరసన




**విజయనగరం, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించి, 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్‌చేస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యాన గురువారం విజయనగరంలోని పిఎస్ఆర్ పాఠశాలలో పదో తరగతి మూల్యాంకన కేంద్రం వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ పాల్తేరు శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ సిహెచ్ భాస్కరరావు, ఆర్థిక కార్యదర్శి డి. శ్యామ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని అన్నారు. మంచి పిఆర్‌సి ఇస్తామని, ఆలస్యం అయితే కరువు భత్యం ప్రకటిస్తామని, దీర్ఘకాలిక బకాయిలను చెల్లిస్తామని, సిపిఎస్/జిపిఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం తీసుకొస్తామని, పెండింగ్ డిఎలను విడుదల చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటివరకు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 12వ పిఆర్‌సి ఇప్పటికే మూడు సంవత్సరాలు ఆలస్యమైందని, కనీసం పిఆర్‌సి కమిషన్‌ను కూడా ప్రభుత్వం నియమించక పోవడం ఆందోళనకరమని అన్నారు. ప్రతిసారి పిఆర్‌సి ఆలస్యం వల్ల ఉద్యోగులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని, వెంటనే 30శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.30 వేల కోట్ల బకాయిల చెల్లింపులకు స్పష్టమైన రోడ్ మ్యాప్ ప్రకటించి, విడతల వారీగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. నాలుగు డిఎలు పెండింగ్‌లో ఉంచడం అన్యాయమని, వెంటనే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, మెమో 57 అమలు చేసి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులను పాత పెన్షన్ కిందికి తీసుకురావాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్యను పరిష్కరించి, అర్బన్ ఎంఈఓ పోస్టులను కేటాయించాలని సూచించారు. కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గురుకులాలు, ఎయిడెడ్ పాఠశాలల సమస్యలను పరిష్క రించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు కె.విజయగౌరి, డి.ఈశ్వర రావు, జోగి నాయుడు, ఎల్. శివ ప్రసాద్, జి.సూర్య నారాయణ, ఎమ్.బల రామునాయుడు, ఎన్.వెంకట్ నాయుడు, వై.అప్పారావు, కె. శ్రీనివాస్ రావు, ఎన్.వి.పైడిరాజు, వి.రమణ, టి. సన్యాసి రాజు, యం. మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## యానాంలో పోలింగ్ ప్రశాంతం



**యానాం, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** యానాం అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ ప్రక్రియ గురువారం స్వల్ప ఘటనల మినహా ప్రశాంతంగా జరిగింది. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ శివరాజ్ మీనా పర్యవేక్షణలో 42 పోలింగ్ బూత్‌లలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరిగింది. ఉదయం మందకొడిగా ప్రారంభ మైన పోలింగ్ గంట తరవాత ఊపందు కుందుకుంది. 9 గంటలకు 16.6 శాతం ఓటింగ్ నమోదు అయింది. 11గంటలకు 36.4 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 57.12 శాతం, 3 గంటలకు 74.63 శాతం నమోదు అయ్యింది. సాయంత్రం 5 గంటలకు 89.80 శాతం నమోదు అయ్యింది. ఒంటి గంట తరువాత ఎండ తీవ్రత వల్ల కొన్ని పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు తగ్గినా 3 గంటల తరువాత నుంచి ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. వృద్ధులు, వికలాంగులు సైతం సహాయకులతో బూత్‌లకు వచ్చి ఓటు హక్కును వినయోగించుకున్నారు. స్థానిక ఎంజిజి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మహిళా ఎన్నికల సిబ్బందితో పింక్ బూత్‌ను, మెట్టకూరు లోని ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో యువ సిబ్బందితో యూత్ బూత్‌ను ఏర్పాటు చేశారు. పోలింగ్ సంద ర్భంగా పలు వీధుల్లో ఆయా పార్టీల కార్యకర్తలు హడావుడి చేయడం కనిపించింది. 93.35 శాతం పోలింగ్ నమోదుమొత్తం 93.35 శాతం పోలింగ్ నమోదైంది. 37,972 మంది ఓటర్లు ఉండగా 35,445 మంది తమ ఓటు హక్కును విని యోగించుకున్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివరాజ్ మీనా తెలిపారు.




## కుతకుతలాడిపోతున్న బాలీవుడ్



ఒక భాష నుంచి రికార్డ్ బ్రేకింగ్ హిట్ వస్తే.. ఆ భాషకు సంబంధించిన ఫిలిం ఇండస్ట్రీ గర్వంతో తలెత్తుకుంటుంది. 'బాహుబలి' సినిమా వచ్చినపుడు తెలుగు సినీ పరిశ్రమ ఎంత గర్వించిందో తటటలిసిందే. కానీ బాలీవుడ్ మాత్రం 'దురంధర్' సినిమా విషయంలో ఎంతమాత్రం ప్రౌడ్‌గా ఫీలవ్వకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. గత ఏడాది డిసెంబరులో 'దురంధర్' రిలీజై సెన్సేషన్ క్రియేట్ చేసినపుడు కానీ.. గత నెలలో 'దురంధర్-2' విడుదలై అంతకుమించిన ప్రభంజనం రేపినపుడు కానీ.. బాలీవుడ్ ప్రముఖులు పెద్దగా స్పందించింది లేదు. హృతిక్ రోషన్ మినహాయిస్తే.. 'దురంధర్' రిలీజైనపుడు బాలీవుడ్ నుంచి ఈ సినిమాను కొనియాడుతూ సోషల్ మీడియా పోస్టులు పెట్టిన వాళ్లు లేరు. హృతిక్ సైతం ఈ సినిమాను పొగుడుతూనే.. కౌంటర్లు వేశాడు. ఇక 'దురంధర్-2' విడుదల సమయంలో ఈ మాత్రం స్పందన కూడా లేదు. సౌత్ నుంచి రాజమౌళి, మహేష్ బాబు, అల్లు అర్జున్ సహా ఎంతోమంది ఈ సినిమాను ఆకాశినికెత్తేశారు.

తాజాగా సందీప్ రెడ్డి వంగ 'దురంధర్-2' గురించి పెట్టిన పోస్టు.. దానికి దర్శకుడు ఈ చిత్ర దర్శకుడు ఆదిత్య ధర్ ఇచ్చిన రిప్లై హాట్ టాపిక్‌గా మారాయి. 'దురంధర్', 'దురంధర్-2' చిత్రాలను ప్రాపగండా ఫిలిమ్స్ అంటూ ముద్ర వేసి మౌనం వహిస్తున్న బాలీవుడ్ ప్రముఖులందరికీ సందీప్ రెడ్డి మామూలు కౌంటర్ ఇవ్వలేదు. సందీప్ అంటే ముందు నుంచి బాలీవుడ్ జనాలకు నచ్చదు. కబీర్ సింగ్, యానిమల్ సినిమాలను అక్కడి వాళ్లు ఓన్ చేసుకోలేదు.

కానీ ఆ చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించి బ్లాక్ బస్టర్లు కొట్టాడు సందీప్. ఈ సినిమాలను డీగ్రేడ్ చేయాలిన చూసిన ఫిలిం క్రిటిక్స్‌ను సందీప్ ఎలా ఆటాడుకున్నాడో తెలిసిందే. ఆదిత్య ధర్ సినిమాలను సైతం ఇలాగే ఫిలిం క్రిటిక్స్ టార్గెట్ చేశారు. వాళ్లకు తన సినిమా బాక్సాఫీస్ ఫలితంతోనే జవాబు చెప్పాడు ఆదిత్య. ఈ ఇద్దరు దర్శకుల సక్సెస్‌ను చూసి బాలీవుడ్ ఓర్చుకోలేకపోతోందన్నది స్పష్టం. వాళ్లు భారీ విజయాలు అందుకోవడమే కాదు.. బాలీవుడ్ లిబరల్ బ్యాచ్‌కు ఇచ్చిన కౌంటర్లు కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

## 'జననాయగన్' నిర్మాత పరిస్థితేంటి?



తమిళంలో సూపర్ స్టార్ రజినీకాంత్ ఉండగా ఆయన్ని మించిన స్టార్ రాడని అంతా అనుకున్నారు. ఆయన సినిమాల బడ్జెట్లు, బిజినెస్, వసూళ్లు ఆ స్థాయిలో ఉండేవి. కానీ విజయ్ గత దశాబ్ద కాలంలో ఇంతింతై అన్నట్లు ఎదిగిపోయి.. రజినీనే మించిపోయాడు. తమిళంలో నంబర్ వన్ హీరోగా ఎదిగాడు. అలాంటి హీరోతో తన చివరి సినిమాను ప్రొడ్యూస్ చేసే అవకాశం దక్కించుకున్న నిర్మాత నారాయణను చూసి ఎంతో లక్కీ అనుకున్నారు. కర్ణాటకకు చెందిన ఈ నిర్మాత కేవీఎన్ ప్రొడక్షన్స్ బేనర్లో విజయ్ చివరి చిత్రం 'జననాగయన్'ను ప్రొడ్యూస్ చేశాడు. ఈ సినిమా ద్వారా ఆయన తక్కువలో తక్కువ రూ.100 కోట్ల లాభం అందుకుని ఉంటాడని అంచనా వేశారు. ఈ సినిమా అనుకున్న ప్రకారం జనవరి 9న రిలీజ్ అయి ఉంటే అంతకుమించే లాభం వచ్చేదేమో. కానీ సెన్సార్ సమస్యల కారణంగా ఆ చిత్రం అనూహ్యంగా వాయిదా పడిపోవడంతో నిర్మాత పరిస్థితి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. వాయిదా వల్ల బయ్యర్లు వెనక్కి తగ్గారు. సమయానికి రావాల్సిన డబ్బులు రాలేదు. ఓటీటీ సంస్థ కూడా డీల్ క్యాన్సిల్ చేసింది. వడ్డీల భారం మీద పడి నిర్మాతకు రావాల్సిన లాభమంతా ఆవిరైపోయే పరిస్థితి తలెత్తింది. ఇప్పటిదాకా జరిగిందంతా ఒకెత్తయితే.. ఇప్పుడు జరుగుతున్న నష్టం మరో ఎత్తు. సినిమా ఎప్పుడు రిలీజైతే అప్పుడు బాగానే డిమాండ్ ఉంటుందని.. పెట్టిన పెట్టుబడి అంతా వెనక్కి వచ్చేలా బిజినెస్ జరుగుతుందని ఆశిస్తూ వచ్చాడు నిర్మాత. కానీ ఇప్పుడు ఈ సినిమా ఆన్ లైన్లో లీక్ అయిపోయింది. ముందు ఐదు నిమిషాల్ ఎపిసోడ్ మాత్రమే బయటికి వచ్చింది. తర్వాత చూస్తే మొత్తం లీక్ అయిపోయింది. పైరసీ వెబ్ సైట్ల ద్వారా పెద్ద ఎత్తున డౌన్ లోడ్స్ జరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. దీని వల్ల జరిగే నష్టం అంతా ఇంతా కాదు. పైరసీ వెర్షన్స్ ఆన్ లైన్ నుంచి డెలీట్ చేయించేందుకు ఎంత గట్టి ప్రయత్నం జరుగుతున్నా సరే లాస్ పెద్దగానే ఉండబోతోంది. సినిమా బిజినెస్ మీద ఇది తీవ్ర ప్రభావమే చూపేలా ఉంది. ఇటు బయ్యర్లు, అటు ఓటీటీ, శాటిలైట్ ఛానెళ్లు ఇప్పుడు అనుకున్న దాని కంటే తక్కువకే సినిమాను అడుగుతారనడంలో సందేహం లేదు. దీని వల్ల నిర్మాతకు భారీ నష్టం తప్పేలా లేదు. మొత్తానికి విజయ్ చివరి చిత్రంతో జాక్ పాట్ కొట్టాడనుకున్న నిర్మాత.. ఇప్పుడు భారీ నష్టాల పాలయ్యేలా కనిపిస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో విజయ్ తన ప్రొడ్యూసర్‌ను ఎంతమేర ఆదుకుంటాడో చూడాలి.

## అతిథి చాలా పెద్ద రిస్కు చేస్తున్నాడు



ఈ మధ్య రీ రిలీజుల ట్రెండ్ కొత్త పోకడలు పోతోంది. మొదలైనప్పుడు కేవలం తెలుగు రాష్ట్రాలకు పరిమితం చేయడం దగ్గరి నుంచి ఇప్పుడు ఓవర్సీస్ లో అడ్వాన్స్ ప్రీమియర్లు వేయడం దాకా హడావిడి మాములుగా ఉండటం లేదు. అయితే అన్నింటికీ ఒకే ఫలితం రావడం లేదు. ఖలేజా మంచి లాభాలు ఇస్తే అతడు కొంచెం పోరాడాల్సి వచ్చింది. వీటి మెయిన్ రిలీజ్ లో బాక్సాఫీస్ రిజల్ట్స్ రివర్స్ లో వచ్చిన సంగతి తెలిసిందే. మే 29 గ్రాండ్ గా అతిథి రాబోతోంది. అనూహ్యంగా ఈసారి అతిథి టీమ్ కొన్ని ప్రయోగాలు చేస్తోంది. ఎడిటింగ్ ప్యాట్రన్ మార్చి న్యూ ఫీల్ వచ్చేలా ప్లాన్ చేస్తున్నారట. అంతే కాదు రీ రికార్డింగ్, డిఐ, రీ స్టోరింగ్ లాంటి చర్యల్లోనూ కొత్త ట్రెండ్ సృష్టించే దిశగా ఏర్పాట్లు చేసుకున్నట్టు తెలిసింది. అయితే ఇక్కడో రిస్క్ ఉంది. నోస్టాల్జియా ఫ్యాన్స్ ఎప్పుడూ ఒరిజినల్ నే కోరుకుంటారు. ఆ మధ్య సూర్య సికందర్ ని ఇలాగే మార్పులు చేసి తమిళంలో మళ్ళీ విడుదల చేస్తే ఆశించినంత గొప్ప స్థాయిలో ఫలితం రాలేదు. మాయాబజార్, షోలే లాంటి క్లాసిక్స్ కి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మొత్తాన్ని మళ్ళీ రీ రికార్డింగ్ చేయించడం అధిక శాతం కల్ట్ లవర్స్ కి నచ్చలేదు. దీని వల్ల వాటి ఆత్మ దెబ్బ తిందని ఫీలవుతూ ఉంటారు. అయితే అతిథి విషయంలో ఈ ఎక్స్ పరిమెంట్ ని సమర్థిస్తున్న వాళ్ళు లేకపోలేదు. అతిథి ఫ్లాప్ అవ్వడానికి కారణం స్క్రీన్ ప్లే అని, కొంచెం నిడివి తగ్గించి, ట్విస్టులను సరిగ్గా ప్రెజెంట్ చేసి ఉంటే పెద్ద హిట్టయ్యేదని మహేష్ బాబు అభిమానులు భావించడం చూశాం. మరి నిజంగా ఆ స్థాయిలో కొత్త కట్ రెడీ చేసి మెప్పిస్తారా లేక ఊరికే ప్రమోషన్ అటెన్షన్ కోసం ఇలాంటి ఫీలర్లు వదులుతున్నారా అనేది థియేటర్ లో చూశాకే క్లారిటీ వస్తుంది. టీజర్ లో అయితే అన్నంత పని చేసినట్టే కనిపిస్తోంది. అయితే మణిశర్మ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ని కొత్తగా వినడంతో పాటు కొన్ని కీలక మార్పులనైతే చూడబోతున్నాం అన్న మాట. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించిన అతిథిని మహేష్ బాబు అన్నయ్య స్వర్గీయ రమేష్ బాబు నిర్మించడం విశేషం.

## తండెల్ దర్శకుడి సినిమాకు పెద్ద బ్రేక్?



చేసినవి తక్కువ సినిమాలే అయినా దర్శకుడిగా మంచి గుర్తింపే ఉంది చందూ మొండేటికి. తొలి చిత్రం 'కార్తికేయ'తోనే అతను బలమైన ముద్ర వేశాడు. ఆ తర్వాత 'సవ్యసాచి'తో నిరాశపరిచినా.. ఆపై కార్తికేయ-2, తండేల్ చిత్రాలతో విజయాలందుకున్నాడు. చందూతో ఈసారి ఒక భారీ యానిమేషన్ సినిమా చేయడానికి టాలీవుడ్ అగ్ర నిర్మాతల్లో ఒకరైన 'సితార ఎంటర్టైన్మెంట్స్' నాగవంశీ రెడీ అయ్యాడు.

గత ఏడాది యానిమేషన్ మూవీ 'మహావతార నరసింహ' భారీ విజయాన్నందుకున్న నేపథ్యంలో అదే తరహాలో ఆంజనేయుడి కథతో 'వాయుపుత్ర' తీయాలని వీళ్లిద్దరూ సంకల్పించారు. దాదాపు ఏడాది నుంచి ఈ ప్రాజెక్టు మీద పని చేస్తున్నాడు చందూ మొండేటి. ఈ ప్రాజెక్టు గురించి నాగవంశీ మీడియా ముందు కూడా ఎంతో ఎగ్జైట్ అయ్యాడు. త్వరలో అనౌన్స్‌మెంట్ గ్లింప్స్ వస్తుందని కూడా గతంలో చెప్పాడు. కానీ ఇప్పుడేమో ఈ ప్రాజెక్టుకు బ్రేక్ పడిందంటూ వార్తలు వస్తున్నాయి. ఈ యానిమేషన్ మూవీని చందూ విజన్‌కు తగ్గట్లు తీయాలంటే బడ్జెట్ కొంచెం ఎక్కువే అవుతుందని.. కానీ బిజినెస్ పరంగా ఆ బడ్జెట్‌ను వర్కవుట్ చేయడం కష్టమని భావిస్తున్నారట. ఇటీవల డిజిటల్ మార్కెట్ బాగా దెబ్బ తినేయడం వల్ల అనుకున్న రేట్లు రావట్లేదు. నాగవంశీ సినిమాలను రెగ్యులర్‌గా కొనే ఓటీటీ సంస్థ.. 'వాయుపుత్ర'కు ఆఫర్ చేసిన రేటు ప్రకారం ఈ సినిమా బడ్జెట్‌ను వర్కవుట్ చేయడం సాధ్యం కాదనే నిర్ణయానికి వచ్చారట. ఈ సినిమాను క్యాన్సిల్ చేయడం కాదు కానీ.. హోల్డ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది.



# బిజినెస్ న్యూస్



## మళ్లీ తెరపైకి టాటా సన్స్ వ్యవహారం.. లిస్టింగ్‌కు జైకొట్టిన ఎస్పీ గ్రూప్



టాటా సన్స్ లిస్టింగ్ వ్యవహారం మళ్లీ తెరమీదకు వచ్చింది. దీన్ని లిస్టింగ్ చేయాలా? వద్దా? అనే అంశంపై టాటా గ్రూప్‌లో ఉన్న అభిప్రాయభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఇప్పటికే టాటా ట్రస్ట్స్ ట్రస్టీ అయిన వేణు శ్రీనివాసన్ లిస్టింగ్‌కు బహిరంగంగా మద్దతు పలకగా.. మొదటి నుంచీ ఈ విషయంలో అనుకూలంగా ఉన్న షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ లిస్టింగ్‌కు జైకొట్టింది. దీంతో ప్రస్తుతం ఈ బంతి ఆర్‌బీఐ కోర్టులో పడింది. టాటా సన్స్‌ను సకాలంలో లిస్టింగ్ చేయడం అనేది కేవలం నియంత్రణ సంస్థల నిబంధన మాత్రమే కాదని, అది ఒక అవసరమని షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ ఛైర్మన్ షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ పేర్కొన్నారు. ఇది కార్పొరేట్ పాలనను బలోపేతం చేసి, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచుతుందన్నారు. ఇవే టాటా గ్రూప్‌కు మూలస్తంభాలు అని పేర్కొన్నారు. లిస్టింగ్ ద్వారా రిటైల్ పెట్టుబడిదారులకు మేలు జరుగుతుందన్నారు. టాటా ట్రస్ట్‌లకు స్థిరమైన డివిడెండ్ ఆదాయం లభిస్తుందని, తద్వారా వారు మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టవచ్చని మిస్త్రీ అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి స్పష్టమైన దిశానిర్దేశం కోసం తాము ఎదురుచూస్తున్నామని ఆయన చెప్పారు.

టాటా సన్స్‌ను అప్పర్ లేయర్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)గా ఆర్‌బీఐ గుర్తించింది. దీని ప్రకారం టాటా సన్స్‌ను లిస్ట్ చేయాల్సి ఉంటుంది. టాటా సన్స్‌లో మెజారిటీ వాటా కలిగిన (66 శాతం) టాటా ట్రస్ట్స్‌కు లిస్టింగ్ చేయడం ఏమాత్రం ఇష్టం లేదు. టాటా ట్రస్ట్స్ లిస్టింగ్ వల్ల సంస్థపై ట్రస్ట్ నియంత్రణ తగ్గి, బయటి వ్యక్తుల జోక్యం పెరుగుతుందనేది ట్రస్ట్ ఛైర్మన్ నోయల్ టాటా, మరికొందరు ట్రస్టీల ఆందోళన. అయితే, షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ మాత్రం మొదటి నుంచీ లిస్టింగ్‌కు అనుకూలంగా ఉంది. తీవ్ర ఆర్థిక ఒత్తిళ్లలో ఉన్న ఈ గ్రూప్.. టాటా సన్స్‌లో తనకున్న 18.37% వాటాలను తనఖా పెట్టింది. వాటిని విడిపించుకోవడానికి టాటా సన్స్ లిస్టింగ్ కోసం ఒత్తిడి తెస్తోంది. అయితే, అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీకి సంబంధించి ఆర్‌బీఐ త్వరలో సవరించిన సర్క్యులర్‌ను జారీ చేయనుంది. కంపెనీ విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకుని మినహాయింపు ఇస్తుందా? లేదా లిస్టింగ్ చేయాల్సిందేనని చెబుతుందా? అనేది వేచి చూడాలి.

## ఆల్‌టైమ్ గరిష్ఠానికి సిప్ పెట్టుబడులు




మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి మార్చి నెలలో సిప్ పెట్టుబడులు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ఫిబ్రవరి నెలలో సిప్ రూపంలో రూ.29,845 కోట్లు రాగా.. మార్చిలో సిప్ ఇన్‌ఫ్లోలు 8 శాతం వృద్ధితో రూ.32,087 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది మార్చిలో నమోదైన రూ.25,925 కోట్లతో పోలిస్తే ఈ తరహా పెట్టుబడుల్లో 24 శాతం వృద్ధి నమోదైంది. ఈ మేరకు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా మార్చి నెల గణాంకాలను శుక్రవారం వెలువరించింది. భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతున్నా ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌లోకి నిధులు ప్రవాహం కొనసాగింది. అంతకుముందు నెలతో పోలిస్తే 56 శాతం వృద్ధితో రూ.40,450 కోట్లు పెట్టుబడులు వచ్చినట్లు యాంఫీ వెల్లడించింది. మార్కెట్ ఒడుదొడుకులు, అంతర్జాతీయంగా అనిశ్చితులు కొనసాగిన ప్పటికీ ఈక్విటీ పథకాల పట్ల నమ్మకాన్ని ఇది తెలియజేస్తోందని యాంఫీ పేర్కొంది. ముఖ్యంగా ఫ్లెక్సీ క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ పథకాల్లోకి ఎక్కువ నిధులు వెళ్లాయి. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.10వేల కోట్లు, స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.6,263 కోట్లు, మిడ్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.6,063 కోట్లు చొప్పున పెట్టుబడులు వచ్చాయి. డివిడెండ్ ఈల్డ్, ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ ఫండ్స్ నుంచి నిధులు తరలివెళ్లాయి. అదే సమయంలో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ.2,266 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి. ఫిబ్రవరితో (రూ.5,255 కోట్లు) పోలిస్తే తగ్గుముఖం పట్టాయి. మొత్తంగా మ్యూచువల్ ఫండ్స్ పథకాల నుంచి మార్చి నెలలో రూ.2.4 లక్షల కోట్ల మేర పెట్టుబడులు తరలిపోయాయి. అత్యధికంగా డెట్ మ్యూచువల్ ఫండ్స్ నుంచి రూ.2.95 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు తరలిపోవడం ఇందుకు కారణం. ఫిబ్రవరి నెలలో రూ.94,530 కోట్ల పెట్టుబడులు తరలివచ్చాయి. మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) ఫిబ్రవరిలో రూ.82.03 లక్షల కోట్లుగా ఉండగా.. రూ.73.73 లక్షల కోట్లకు తగ్గుముఖం పట్టింది.

## బ్యాంకింగ్ బ్యాకప్.. భారీ లాభాల్లో ముగిసిన సూచీలు




దేశీయ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాల్లో ముగిశాయి . బ్యాంకింగ్ రంగం నుంచి లభించిన మద్దతు, అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలతో మన సూచీలు రాణించాయి. దాంతో సెన్సెక్స్ 918 పాయింట్లు లాభపడి 77,550 వద్ద ముగిసింది. నిఫ్టీ 275 పాయింట్లు ఎగబాకి, 24,050 వద్ద స్థిరపడింది. క్రితం సెషన్‌లో 76,631 వద్ద ముగిసిన సెన్సెక్స్.. నేటి ట్రేడింగ్‌లో 77,121 వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 77,622 వరకు ఎగబాకింది. నిఫ్టీ సూచీలో ఏషియన్ పెయింట్స్, ఐషర్ మోటార్స్, ఐసీఐసీఐ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఆటో షేర్లు రాణించాయి. కోల్ ఇండియా, సన్ ఫార్మా, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. డాలర్ పోలిస్తే రూపాయి మారకం విలువ 92.73గా ఉంది. బ్యాంకింగ్ షేర్లలో భారీ కొనుగోళ్లే నేటి లాభాలకు ప్రధాన కారణం. ఇక, దక్షిణ కొరియా కొస్పి, జపాన్ నిక్కీ సహా పలు ఆసియా మార్కెట్లు లాభాల్లో కదలాడాయి. నేడు ఒక దశలో రూపాయి కోలుకోవడం కూడా కలిసొచ్చింది.

## మొబైల్ యూజర్లకు షాక్.. మళ్లీ ధరలు పెంచిన శాంసంగ్



దక్షిణ కొరియా మొబైల్ తయారీ దిగ్గజం శాంసంగ్ (ఝఎంబఅస్త్ర) మరోసారి తన స్మార్ట్‌ఫోన్ ధరలను పెంచేసింది. ఫిబ్రవరి నెలలో ఒకసారి పలు ఎంట్రీ లెవల్, మిడ్ రేంజ్ స్మార్ట్‌ఫోన్లపై ధరలను పెంచిన ఈ సంస్థ.. తాజాగా ఎంపిక చేసిన ఫోన్ల ధరలను సవరించింది. గెలాక్సీ ఏ, ఎఫ్ సిరీస్ మోడళ్లు ఇందులో ఉన్నాయి. ఈ మేరకు టిప్‌స్టర్ అభిషేక్ యాదవ్ సదరు ధరల పట్టికను ఎక్స్‌లో షేర్ చేశారు. పెరిగిన ధరలు నేటినుంచే అమల్లోకి రానున్నాయి.

ఏయే స్మార్ట్‌ఫోన్లపై ఎంతంటే..?

టిప్‌స్టర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. గెలాక్సీ ఏ06 స్మార్ట్‌ఫోన్ ధరను దాదాపు శాంసంగ్ రూ.1000 పెంచేసింది. దీంతో బేస్ వేరియంట్ ధర రూ.13,499కు చేరింది. ఏ07 స్మార్ట్‌ఫోన్‌పై రూ.1250 పెంచింది. దీంతో దీని ప్రారంభ ధర రూ.10,999 నుంచి ప్రారంభం కానుంది. గెలాక్సీ ఏ17 స్మార్ట్‌ఫోన్‌పై వేరియంట్‌ను బట్టి రూ.1000 నుంచి రూ.1500 మేర పెంచింది. దీంతో టాప్ వేరియంట్ ధర రూ.27,999కు చేరింది. శాంసంగ్ ఏ36పై రూ.1500 నుంచి రూ.3000, గెలాక్సీ ఏ56 స్మార్ట్‌ఫోన్‌పై రూ.2000 నుంచి రూ.3500 చొప్పున పెంచింది.

ఈ మోడళ్ల పైనా..

రెండ్రోజుల క్రితం కూడా కొన్ని స్మార్ట్‌ఫోన్ ధరలను శాంసంగ్ సవరించింది. గెలాక్సీ ఎం36, గెలాక్సీ ఎఫ్ 36 స్మార్ట్‌ఫోన్లపై రూ.1000 చొప్పున పెంచింది. గెలాక్సీ ఎం6, ఎఫ్06 స్మార్ట్‌ఫోన్లపై రూ.1500 నుంచి రూ.2000 మేర పెంచింది. గెలాక్సీ ఎం 07, గెలాక్సీ ఎఫ్07 మోడళ్లపై రూ.1900 వరకు రేట్లను సవరించింది. ఈ ధరలు ఏప్రిల్ 8 నుంచే అమల్లోకి వచ్చాయి.

# కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు నానబెట్టారు

**- ఇప్పుడే రిపేర్లు చేయడంలో ఆంతర్యం ఏమిటో - గతంలోనే చేసివుంటే రైతులకు మేలు జరిగేది కదా**

**- కేవలం కమిషన్ల కోసమేనేమో అన్న అనుమానాలు - రియల్ ఎస్టేట్ కోసమే ఫ్యూచర్ సిటీ జపం**

**- జిహెచ్ఎంసిలో తీవ్ర అవినీతి జరుగుతోంది - మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత**



**హైదరాబాద్, ఏప్రిల్ 10 :** కాళేశ్వరాన్ని వినియోగం లోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతి స్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. రెండున్నరేళ్లు దారుణంగా వ్యవహరించి పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ న ఇర్ణయం తీసుకుని ఉంటే రైతులకు మేలు జరిగి ఉండేదని అన్నారు. హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ..కమిషన్ల కోసమే ఇప్పుడు కాళేశ్వరానికి మరమ్మతులు అంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్, అర్బన్ ఫారెస్ట్రీలో తీవ్రమైన అవినీతి జరుగుతోం దన్నారు. రియల్ ఎస్టేట్ కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్‌కు నష్టం చేయవద్దని కోరారు. అలాగే జీహెచ్ఎంసీలో తీవ్ర అవినీతి జరుగుతోందని కవిత ఆరోపించారు. అనేక గ్రామాలు జీహెచ్ఎంసీ పరిధిలో కలిసినా సరైన అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. హెచ్ఎండీఏ పరిధిలో 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ అభివృద్ధికి ఉపయోగించలేదని కవిత ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. 2017 నుంచి 2021 వరకు 480 కోట్ల రూపాయల పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత మరో 1,140 కోట్ల రూపాయలను అదే పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని వెల్లడించారు. ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. రూ.50 కోట్ల టెండర్ వేస్తే దాదాపు 50 శాతం తిరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని.. కానీ నామినేషన్ పద్ధతిలో ఇలాంటి లాభం లేకపోవడం అవినీతికి దారితీస్తోందని ఆరోపించారు. నర్సరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న 6 వేల మంది స్కిల్డ్ లేబర్‌కు 23,800 రూపాయలు ఇవ్వాల్సి ఉందని కవిత తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఒక కంపెనీపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ వేయించారని.. తర్వాత ఏమైందో తెలియాలని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డులో గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్టును రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక కూడా కొనసాగిస్తున్నారని విమర్శిం చారు. దీనిపై ఆరోపణలు చేసిన రేవంత్ దీనిని ఎలా కొనసాగిస్తారని అన్నారు. ప్లానింగ్ డిపార్ట్ మెంట్‌పై ముఖ్యమంత్రి దృష్టి పెడుతున్నారని.. సీఎం దగ్గర బ్యాగులు మోసే వ్యక్తి చెప్పినట్టు మాత్రమే పనులు జరుగుతున్నా యని కవిత ఆరోపించారు. జీహెచ్ ఎంసీ అంటే గుంపు మేస్త్రి పాలనలో జరుగుతున్న మహా అవినీతి అని వ్యాఖ్యానించారు. అవినీతి కోసమే సీఎం 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారని కవిత అన్నారు. నెల 25వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. 500 మంది వలంటీర్లు సేవలు అందిస్తారని తెలిపారు. మహిళా బిల్లు అమలు కాకపోవడంతో 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు నష్టపోయారని చెప్పారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ధర్మపురి అరవింద్‌లో పురుష అహంకారం కనిపిస్తోందని.. ప్రజలు ఆయన్ను ఎప్పుడో మర్చిపోయారని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నాను... ఎవరో చెప్తే పార్టీ పెట్టే స్థాయిలో లేను' అని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను కేరళం ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తాము వీడియో రిలీజ్ చేశామని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

# లెబనాన్‌పై దాడులు.. పెద్దఎత్తున పౌరుల మరణాలపై భారత్ ఆందోళన




న్యూఢిల్లీ: లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న వైమానిక దాడులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ దాడుల్లో పెద్ద సంఖ్యలో పౌరులు మరణించినట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఉద్రిక్తలు తగ్గించి సంయమనం పాటించాలని కోరింది. అంతర్జాతీయ చట్టాల గౌరవం, పౌరుల రక్షణ అత్యంత ముఖ్యమని స్పష్టం చేసింది. అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన ప్పటికీ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. లెబనాన్ ఈ ఒప్పందం పరిధిలోకి రాదని ఇజ్రాయెల్ వాదిస్తోంది. లెబనాన్‌పై దాడులు ఆపకుంటే అమెరికాతో శాంతి చర్చల నుంచి వైదొలుగుతామని ఇరాన్ హెచ్చరిస్తోంది.

**శాంతి, సుస్థిరతకు భంగం: ఎంఈఏ**

'లెబనాన్‌పై దాడుల్లో పెద్దసంఖ్యలో పౌరులు మరణించినట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. యూఎన్ఐఎఫ్ఐఎల్‌కు ట్రూప్ కంట్రిబ్యూటింగ్ దేశంగా లెబన్‌నాన్‌లో శాంతి, భద్రతలకు భారత్ ఎంతో వెచ్చిస్తోంది. జరుగుతున్న పరిణామాలు మాత్రం ఆందోళన కలిగిస్తున్నాయి. పౌరుల రక్షణ, అంతర్జాతీయ చట్టాలు, దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని కోరుతున్నాం . భారతదేశం ఎప్పుడూ పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. లెబనాన్‌లోని భారత పౌరుల భద్రతను అక్కడి ఇండియన్ ఎంబసీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది' అని విదేశాంగ శాఖ కార్యదర్శి రణ్‌ధీర్ జైశ్వాల్ మీడియా సమావేశంలో తెలిపారు.

**మోదీ ఆదేశాలతో గల్ఫ్ దేశాల్లో మంత్రులు**

పశ్చిమాసియాలో పరిస్థితులను జాగ్రత్తగా గమనిస్తున్నామని, గల్ఫ్ ప్రాంతాల్లోని దేశాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు సాగిస్తున్నామని జైశ్వాల్ తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు దేశ ఇంధన భద్రతను పటిష్టం చేసేందుకు మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారని చెప్పారు. విదేశాంగ మంత్రి ప్రస్తుతం మారిషస్‌లో ఉన్నారని, అక్కడి నుంచి 11,12 తేదీల్లో యూఏఈలో పర్యటిస్తారని తెలిపారు. భారత్-యూఏఈ సంబంధాల బలోపేతంపై అక్కడి నాయకులతో చర్చిస్తారని అన్నారు. పెట్రోలియం మంత్రి సైతం ప్రస్తుతం ఖతార్‌లో పర్యటి స్తున్నట్టు చెప్పారు. భారత్‌కు నమ్మకమైన ఇంధన సరఫరాదారుగా ఉన్న ఖతార్ సైతం భారత్‌తో ఇందన సహకారానికి కట్టుబడి ఉన్నట్టు తెలిపిందని వివరించారు.

# రష్యాలో చిక్కుకుపోయిన 26 మంది భారతీయులు.. సుప్రీం కోర్టులో పిటిషన్



రష్యాలో చిక్కుకుపోయిన 26 మంది భారతీయులను స్వదేశానికి సురక్షితంగా తీసుకొచ్చేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిని పరిశీలించిన న్యాయ స్థానం విచారణకు అంగీకరించింది. అయితే, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వీరిని రష్యాకు పంపించిన కొందరు ఏజెంట్లు.. వారిని తప్పుదోవ పట్టించారనే ఆరోపణ లున్నాయి. ఆ తర్వాత పుతిన్ సైన్యంతో కలిసి ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొనేలా వారిపై ఒత్తిడి తెచ్చారని సమా చారం. రష్యాలో 26 మంది భారతీ యులు చిక్కుకు పోయారని, వారి ఆచూకీ తెలుసు కోవడానికి దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. మాస్కో నిర్బంధంలో ఉన్న వారి ప్రస్తుత పరిస్థితి ఏంటనే విషయాన్ని తెలియ జేయాలని అందులో పేర్కొన్నాయి. ఉక్రెయిన్‌తో రష్యా చేస్తోన్న యుద్ధంలో వీరు పాల్గొనాల్సి వచ్చిందని.. కొందరు గాయపడటం, మరికొందరు నిర్బంధంలో ఉన్నట్లు తెలిసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.పిటిషనర్ల విజ్ఞప్తిని పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం.. కేంద్రాన్ని వివరణ కోరింది. ఈ పిటిషన్‌ను పరిశీలించి, కేంద్రం నుంచి సూచనలు తీసుకుంటానని ప్రభుత్వ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలియజేశారు. ఇందుకు అంగీకరించిన న్యాయస్థానం.. ఈ నెల చివరలో దీనిపై విచారణ చేపడతామని తెలిపింది.

# ఉత్తర ప్రదేశ్ ఎస్ఐఆర్ జాబితా : తుది జాబితాలో 84 లక్షల ఓటర్లు చేరిక




లక్నో : ఉత్తరప్రదేశ్ ఎస్ఐఆర్ తుది జాబితాను శు క్రవారం ఆ రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ నవదీప్ రిన్వా విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్నోలో లోక్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రిన్వా మాట్లాడుతూ ఎస్ఐఆర్ ముసాయిదా జాబితా కంటే.. తుది జాబితాలో 84 లక్షల మందికిపైగా ఓటర్లు చేరారని, మొత్తం ఓటర్ల సంఖ్య 13.39 కోట్లకు చేరిందని ఆయన వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అక్టోబర్ 7 -- 2025 నుంచి ఏప్రిల్ 10 -- 2026 వరకు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియ 75 జిల్లాల్లో 403 అసెంబ్లీ నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాలను కవర్ చేసిందని ఆయన పేర్కొన్నారు. జనవరి 6 -- 2026న ఎస్ఐఆర్ యుసాయిదా జాబితాను రిన్వా విడుదల చేశారు. ఆ జాబితాలో 12,55,56,025 మంది ఓటర్లున్నారు. ఇందులో 6.88 కోట్ల మంది పురుషులు, 5.67 కోట్ల మంది మహిళలు, 4,199 ట్రాన్స్‌జెండర్ ఓటర్లున్నారు. 18 -- 19 వయసు గల ఓటర్లు 3,33,981 మంది ఉన్నారు. ప్రతి వెయ్యి మంది పురుషులకు 824 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.ఇక నేడు విడుదల చేసిన తుది జాబితాలో ఓటర్ల సంఖ్య 13,39,84,792 మంది ఉన్నారు. పురుషుల ఓటర్లు 7,30,71,071 (54 శాతం), మహిళా ఓటర్లు 6,09,09,525 (45.46 శాతం), ట్రాన్స్ జెండర్ ఓటర్లు 4,206 (0.01 శాతం కన్నా తక్కువ) ఉన్నారు. ముసాయిదా జాబితా కంటే తుది జాబితాలో 18-19 వయసు గలవారు 17,63, 360కి పెరిగారు. సుమారు 1.32 శాతం పెరి గింది. లింగ నిష్పత్తి కూడా మెరుగుపడింది. ప్రతి వెయ్యి మంది పురుషులకు 834 మంది మహిళా ఓటర్లున్నారు. మొత్తంగా ముసాయిదా జాబితాకు, తుది జాబితాకు 84, 28,767 మంది ఓటర్లు పెరిగారు. పెరిగిన వారిలో పురుషులు 42, 27,902, మహిళలు 42,00, 778 మహిళలు, 87 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు పెరిగారు. ఇక మొత్తంగా 18 -- 19 వయసు గల వారు 14,239,379 మందికి పెరగగా, లింగ నిష్పత్తి 824 నుంచి 834కి పది పాయింట్ల మేర పెరిగింది. ఓటర్లు ప్రత్యేకించి కొన్ని జిల్లాలో పెరిగారని ఎన్నికల అధికారి వెల్లడించారు. ప్రయాగ్‌రాజ్‌లో 3,29,421, లక్నో 2,85,961, బరేలీ 2,57,000, ఘజియాబాద్ 2,43,666, జౌన్‌పూర్‌లో 2,37,590 మంది ఓటర్లు పెరిగారు. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తికావడానికి ఎన్నికల అధికారులు, రాజకీయపార్టీలు, ఓటర్లను సమన్వయం చేసుకోవడం వల్లే ఇది సాధ్యమైందని సిఇఓ రిన్వా తెలిపారు. ఇక ఎస్ఐఆర్ ప్రక్రియలో 75 మంది జిల్లాల ఎలక్షన్ ఆఫీసర్లు (డిఇఓ), 403 ఇఆర్ఓ (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు), 12,758 అసిస్టెంట్ ఇఆర్ఓలు, 18,026 బిఎల్ఓ సూపర్‌వైజర్లు, 1,77,516 బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్ఓ), 5,82,877 మంది బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

# క్యూబాకు అండగా ఉంటాం

## రష్యా ఉప విదేశాంగ మంత్రి



హవానా : అమెరికా దురాక్రమణ బెదిరింపుల నేపథ్యంలో రష్యా ఉప విదేశాంగ మంత్రి సెర్గీ ర్యాబ్కోవ్ తాజాగా క్యూబాలో పర్యటించారు. గురువారం హవానా కన్వెన్షన్ సెంటర్‌లో సెర్గీతో క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక సంబంధాలను మరింత బలపరుచుకునే విషయాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ఇప్పటికే ఉన్న సంబంధాలను మరింత పెంపొందిం చుకోవడానికి ఇరు దేశాలు సుముఖత వ్యక్తం చేసినట్లు క్యూబా విదేశాంగమంత్రిత్వశాఖ టెలిగ్రామ్‌లో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. క్యూబాను ప్రభావితం చేస్తున్న ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో మాస్కో అందిస్తున్న సంఘీభావ ప్రయత్నాలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్‌కు డియాజ్ కానెల్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.కాగా, ఈ పర్యటన సందర్భంగా 'మేము మీకు అండగా ఉంటాము' అని ర్యాబ్కోవ్ కానెల్‌కి నొక్కి చెప్పారు. ఈ పర్యటనలో ఇరు దేశాల మధ్య రాజకీయ, వాణిజ్య, పారిశ్రామిక సంబంధాలపై ఇరు ప్రతినిధి బృందాలు దృష్టి సారించాయి. ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు క్యూబాలోని పారిశ్రామిక సదుపాయాలను నిర్వహించేందుకు రష్యన్ కంపెనీలకు అధికారం ఇవ్వడం జరిగింది. ఏప్రిల్ 1న సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన 23వ రష్యా- క్యూబా అంతర్ ప్రభుత్వ కమిషన్‌లో ఈ నిర్ణయం ఖరారు చేయబడింది. ఈ కమిషన్‌లో క్యూబా ఉత్పాదక సామర్థ్యాన్ని బలోపేతం చేసే ఉమ్మడి ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి ఇరుపక్షాలు అంగీకరిం చాయి.

ఈ చొరవ వ్యాపార సహకారానికి కొత్త అవకాశాల్ని కలిస్తూ, పెట్టుబడుల గమ్యస్థానంగా క్యూబా ఆకర్షణను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు రష్యా పరిశ్రమ, వాణిజ్య శాఖ ఉపమంత్రి రోమన్ చెకుషెవ్ అన్నారు.

## ఇజ్రాయెల్ ఆగ్రహం!

# పాక్ మంత్రి ట్వీట్‌ను డిలీట్ చేయించిన ఆర్మీ చీఫ్



లెబనాన్‌లో ఇజ్రాయెల్ నరమేధం సృష్టిస్తోం దంటూ పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన పోస్టు వివాదాస్పదమైంది. అమెరికా-ఇరాన్ శాంతి చర్చల్లో తటస్థ పాత్ర పోషిస్తున్నట్లు పేర్కొన్న దేశం నుంచి ఇలాంటి ప్రకటనలు రావడం ఏంటని ఇజ్రాయెల్ ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ దేశాన్ని క్యాన్సర్‌తో పోల్చిన ఖవాజా తర్వాత ఆ పోస్టు డిలీట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ జోక్యంతోనే ఖవాజా వెనక్కి తగ్గినట్లు భారత నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి.

పాక్ మంత్రులు బాధ్యతారాహిత్య ప్రవర్తన వల్ల ఆ దేశ మధ్యవర్తిత్వ పాత్రకు ప్రాధాన్యం తగ్గి.. సీజ్‌ఫైర్ ప్రక్రియకు అంతరాయం కలగవచ్చనే ఉద్దేశంతోనే మంత్రిపై మునీర్ ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. పాక్ తటస్థ పాత్రను ఇలాంటి చర్యలు దెబ్బ తీస్తాయని మునీర్ భావించి ఉంటాడని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ శాంతి చర్చల ప్రక్రియ విఫలమైతే గల్ఫ్‌లో మళ్లీ ఘర్షణలు చెలరేగితే ఇంధన ధరలు భగ్గుమంటాయి. ఇప్పటికే ఆర్థిక సమస్యలతో సతమత మవుతున్న పాక్ పరిస్థితిని ఈ పరిణామాలు మరింత దిగజార్చుతాయనే ఆందోళన కూడా మునీర్ జోక్యానికి కారణం కావొచ్చనే వాదనలు కూడా వినబడు తున్నాయి. పశ్చి మాసియాలో అస్థిరతలు తన సరిహద్దుల వరకు విస్తరించి, ఉగ్రవాద కార్యకలా పాలు పెరగవచ్చనే భయం కూడా పాక్‌కు లేక పోలేదు. ఇవన్నీ ఒక ఎత్తైతే.. మునీర్ సారథ్యం లోని సైన్యం పాక్ విదేశాగ విధానంపై తిరుగులేని నియంత్రణను కలిగి ఉందని, పౌర ప్రభుత్వ అధికారం పరిమితమేనని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. అమెరికా-ఇరాన్ చర్చలు సహా పలు కీలక దౌత్యపరమైన అంశాల్లో పౌర నాయకత్వాన్ని పక్కన పెడు తున్నారనే దానికి తాజా ఘటన అద్దం పడుతోందని తెలిపాయి.

# 200 మిలియన్ డాలర్ల అమెరికన్ డ్రోన్ అదృశ్యం!



హోర్ముజ్ జలసంధిపై ప్రయాణిస్తున్న ఒక అమెరికా నిఘా డ్రోన్ అకస్మాత్తుగా అదృశ్యం కావడం కలకలానికి దారి తీసింది. అమెరికా అత్యంత ఖరీదైన విహంగంగా పేరున్న ఎమ్‌క్యూ-4సీ ట్రైటన్ అనే నేవీ డ్రోన్ నేడు హోర్ముజ్ గగనతలంలో కనిపించకుండా పోయింది. ఎమర్జెన్సీ ప్రకటించిన కాసేపటికే విమానం కనిపించకుండా పోయిందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. యూఎస్-ఇరాన్ చర్చల వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం కలకలానికి దారి తీసింది. పర్షియన్ గల్ఫ్, హోర్ముజ్ జలాలపై నిఘా కోసం బయలుదేరిన డ్రోన్ దాదాపు మూడు గంటల తరువాత కనిపించకుండా పోయింది. ఫ్లైట్ రాడార్24 డేటా ప్రకారం, ఈ డ్రోన్ మిషన్ అనంతరం తిరిగొస్తున్న ఇరాన్ వైపుగా మళ్లింది. ఆ తరువాత కాసేపటికే ఎమర్జెన్సీ (7700 కోడ్) ప్రకటించింది. ఈ క్రమంలో కిందకు దిగిన విమానం రాడార్ స్క్రీన్‌లపై కనుమరుగైంది. విమానాన్ని ఎవరైనా కూల్చేశారా? లేక మరేదైనా సాంకేతిక లోపం తలెత్తిందా? అన్న విషయాలపై ఇంకా స్పష్టత రాలేదు.

**డ్రోన్ ప్రత్యేకతలు ఇవీ..**

దాదాపు 200 మిలియన్ డాలర్ల విలువైన ఈ డ్రోన్‌ను యూఎస్ సెంట్రల్ కమాండ్ పరిధిలోని గల్ఫ్ ప్రాంతంలో మోహరించారు. సముద్రజల్లాల్లో కీలక ప్రాంతాలపై ఎక్కువ సమయం పాటు నిఘా పెట్టేందుకు అమెరికా ఈ డ్రోన్‌ను వినియోగిస్తోంది. పీ-8ఏ పొసైడన్ పాట్రోల్ ప్లేన్స్‌కు అనుబంధంగా దీన్ని వినియోగిస్తున్నారు. 7,400 నాటికల్ మైళ్ల పరిధిలోని జలాలపై 50 వేల అడుగుల ఎత్తున ప్రయాణిస్తూ 24 గంటలకు పైగా నిఘా కార్యకలాపాలు నిర్వహించే సామర్థ్యం ఈ డ్రోన్ సొంతమని నిపుణులు చెబుతున్నారు. ఇక ప్రస్తుతం యుద్ధం కారణంగా అమెరికాకు క్షణానికి రూ. 9.8 లక్షలు ఖర్చవుతున్నాయని మరికొందరు అంటున్నారు.

# ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం, మాన్యువల్ స్కావెంజర్ నిరోధక చట్టాలపై అవగాహన కార్యక్రమం







**విశాఖపట్నం ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** విశాఖపట్నం జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ మరియు డివిజనల్ స్థాయి మానిటరింగ్ కమిటీ సభ్యులకు ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం మరియు మాన్యువల్ స్కావెంజర్ నిరోధక చట్టాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం జిల్లా కోర్టులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీ ఆర్. సన్యాసినాయుడు గారు మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలను నివారించడంలో కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. అట్రాసిటీ ఘటనలు జరగకముందే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో



పర్యటించి ప్రజల్లో శాంతి, సామరస్య వాతావరణం నెలకొల్పేలా అవగాహన కల్పించాలని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించి ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చూపినా లేదా అత్యాచారాలకు పాల్పడినా కఠిన శిక్షలు తప్పవని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. భూ వివాదాలు, అసైన్డ్ భూముల సమస్యలు సివిల్ కోర్టుల పరిధిలోకి వస్తాయని, పోలీసులు వాటిలో జోక్యం చేసుకోరని స్పష్టం చేశారు

జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు గారు మాట్లాడుతూ, విక్టిమ్స్‌కు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం, సకాలంలో ఆర్థిక సహాయం మరియు పునరావాసం కల్పించడంలో రెవెన్యూ శాఖ వెంటనే స్పందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహిం చిన డిప్యూటీ డైరెక్టర్, సోషల్ వెల్ఫేర్ కె. రామారావు మాట్లాడుతూ, పౌర హక్కుల చట్టం నుండి ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం వరకు ఉన్న వివిధ నిబంధనలను వివరించి, ఎస్సీ, ఎస్టీలకు ఉన్న హక్కులు, రక్షణలను వివరిం చారు. కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి బాధితుల సమస్యలను యంత్రాంగానికి త్వరితగతిన చేరవేయాలని కోరారు.ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి రేవతి గారు, మాజీ పీపీ ఎస్.ఎస్.ఎస్. వాసు కేసుల విచారణలో ఎదురయ్యే సాంకేతిక అంశాలను వివరిం చారు. ఏసీబీ ప్రతినిధి శ్రీ అంబేద్కర్ గారు మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో కమిటీ సభ్యుల సహకారం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఆర్డీవో శేషశైలజ, జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ సుబ్బారాయుడు, చొక్కాకుల రాంబాబు, శ్రీమతి కల్పన, శ్రీమతి సుజాత, శ్రీ జోసెఫ్, శ్రీ ఆంజనేయులు తదితరులు పాల్గొని జిల్లాలోని వివిధ కేసులపై చర్చించారు.

# ముచ్చటగా మూడోసారి వాయిదా పడ్డ వైఎస్సార్ వాణిజ్య సముదాయం

## జిల్లా డిఎల్‌పిఓ ఉత్తర్వులు వచ్చేవరకు వేలంపాట నిలుపుదల



**కొత్తవలస, ఏప్రిల్ 10, నేటి మనదేశమ్ ప్రతినిధి :-** కొత్తవలస మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణంలో గల వైయస్సార్ వాణిజ్య సముదాయం బహిరంగ వేలం పాట ముచ్చటగా మూడోసారి వాయిదా పడింది వేలం పాట పాడేందుకు ఆరుగురు సభ్యులు సెలవెన్స్ తో పాటు లక్ష రూపాయలు నగదు డిపాజిట్ చేసిన షాప్ నంబర్ నాలుగు 45 వేల రూపాయలు షాప్ నెంబర్ 5 కు 80 వేల రూపాయలు షాప్ నెంబర్ 17 కు 45 వేల రూపాయలు షాప్ నెంబర్ 20 కు 40 వేల రూపాయలు అప్సెట్ ప్రైస్ అత్యధికంగా ఉండటంతో పాటదారులు మొగ్గు చూపలేదు ఇప్పటికే ఈనెల రెండవ తారీఖున అలానే ఏడవ తారీఖున పదవ తారీఖున మూడు దఫాలుగా బహిరంగ వేలం పెట్టిన మొగ్గు చూపకపోవడంతో తదుపరి జిల్లా డిఎల్పిఓ ఆదేశాలు వచ్చేవరకు వేలం పాట నలిపివేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ రావు తెలిపారు.

# విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ఫ్లై91విమాన సర్వీసు ప్రారంభం




**గన్నవరం, ఏప్రిల్ 10 నేటి మనదేశమ్ :** విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు మరో విమాన సర్వీసును కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శ్రీకాకుళం క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. 2024లో ప్రారంభమైన 'ఫ్లై91' సంస్థ ఉడాన్ పథకం ద్వారా అంచెలంచెలుగా ఎదిగి.. దక్షిణాది రాష్ట్రాల్లో విశేష విమాన సేవలు అందిస్తున్నట్లు కేంద్రమంత్రి కొని యాడారు. ఈనెల 17వ తేదీ నుంచి హైదరాబాద్ వేదికగా 22 రాకపోకలు నిర్వహించేందుకు ముందుకొచ్చిన ఆ సంస్థ నిర్వాహకులను అభినందించారు. త్వరలో దుబాయ్, వారణాసి, కొచ్చితోపాటు ఇతర సర్వీసుల రాకపోకలకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విజయవాడ, రాజమహేంద్రవరం, కడప విమానాశ్రయాల అభివృద్ధి పనులు శరవేగంగా కొన సాగుతున్నట్లు వెల్లడించారు. విశాఖపట్నంలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులు జూన్ నాటికి పూర్తి చేసుకుని.. జులైలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గోవా కేంద్రంగా దేశవ్యాప్తంగా ప్రాంతీయ విమాన సేవలు అంది స్తున్న ఈసంస్థకు చెందిన సర్వీసును స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్‌తో కలిసి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ప్రయాణికులకు బోర్డింగ్ పాస్ అందజేసి ప్రారం భించారు. రాష్ట్రంలో విజయవాడతో పాటు రాజమండ్రి విమానా శ్రయం నుంచి తొలుత తన సర్వీసులను హైదరాబాద్‌కు ఫ్లై 91 సంస్థ ఆరంభిస్తోంది. విజయవాడ నుంచి ఉదయం 7.30కు బయలుదేరి హైదరాబాద్ కు 8.40కు ఈ రోజువారీ సర్వీసు చేరుకుంటుంది. ఏప్రిల్ 17 నుంచి మరో సర్వీసును కూడా విజయవాడ నుంచి హైదరాబాద్‌కు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

## నేడు లేదా రేపు ఇంటర్ ఫలితాలు

**హైదరాబాద్, ఏప్రిల్10 :** తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల విడుదలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, రాష్ట్ర విద్యాశాఖ ఏప్రిల్ 12న ఆదివారం ఫలితాలను వెల్లడించేందుకు రంగం సిద్ధం చేసినప్పటికీ, పలు జాతీయ స్థాయి నివేదికల ప్రకారం ఒక రోజు ముందే అంటే ఏప్రిల్ 11న శనివారం కూడా ఫలితాలు వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 26 నుంచి మార్చి 18 వరకు జరిగిన వార్షిక పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు.


ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితా లను ఒకేసారి విడుదల చేసేందుకు బోర్డు అన్ని కసరత్తులు పూర్తి చేసింది. విద్యార్థులు తమ ఫలితాలను విడుదలైన వెంటనే అధికారిక వెబ్‌సైట్లలో హాల్ టికెట్ నంబర్‌ను నమోదు చేసి మార్కుల మెమోను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## వాడబలిజల దుర్గాలమ్మ జాతరకు

# వాసుపల్లి రూ.50,000/-లు విరాళం..

**- అమ్మదయ ఉంటే అన్ని ఉన్నట్టే... - 34వ వార్డులో 14,15,16వ తేదీల్లో జాతర**

**- మాజీ ఎమ్మెల్యే గణేష్ కుమార్ కి ఆహ్వాన పత్రిక అందజేసిన కమిటీ సభ్యులు..**



**విశాఖపట్నం ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్) :** దక్షిణ నియోజకవర్గం కొబ్బరి తోట వీధి వాడబలిజి మత్స్యకార కులానికి చెందిన గ్రామ దేవత శ్రీ దుర్గాలమ్మ జాతర మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ?.50,000/-లు విరాళం అందజేశారు. ఆశీలమెట్ట కార్యాలయంలో శుక్రవారం కమిటీ సభ్యులకు ?.50,000/-ల చెక్ ను అందజేశారు. ప్రతి ఏడాది మాదిరిగా ఉత్సవాలకు సహాయ సహకారాలు అందిస్తున్న వాసుపల్లి గణేష్ కుమార్ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో మళ్లీ తమ నాయకుడిగా అధికారంలోకి వచ్చి సేవలు విస్తృతం చేయాలని అమ్మవారిని ఆరాధిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 14, 15, 16వ తేదీల్లో జరగనున్న జాతర మహోత్సవానికి వాసుపల్లి గణేష్ కుమార్ ని సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వాసుపల్లి మాట్లాడుతూ వాడబలిజి కులానికి చెందిన గ్రామ దేవతగా విరాజిల్లుతున్న శ్రీ దుర్గాలమ్మవారు జాతర విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. అమ్మవారి చల్లని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలన్నారు. తమ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవ చేసే భాగ్యం మళ్లీఅమ్మవారు అందిస్తారని ఆకాంక్షించారు. ఇక్కడి అమ్మవారు ఎంతో ప్రతిష్ట చెందారని, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా తమ వాడ బలిజిల ఆరాధ్య దైవంగా ప్రతి ఏటా తీర్థ మహోత్సవం అంగరంగ వైభవంగా కమిటీ సభ్యులు నిర్వహిస్తారని , అదే మాదిరిగా ఈ ఏడాది కూడా విజయవంతం కావాలని వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దాసరి ఎల్లయ్య, వాసుపల్లి ఎల్లరారావు, వాసుపల్లి దానయ్య, గరికిన కొండబాబు, కెవిఎన్ రాజు, సూరడా రాంబాబు, మెరుగు ఎలాజి స్టేట్ నాయకులు లింగం శ్రీను, లండ రమణ,జిల్లా నాయకులు వాసుపల్లి ధనరాజు, కడవల నాగమణి,వార్డ్ నాయకులు గాలి పార్వతి, సిహెచ్. జ్యోతి, సూరడా లక్ష్మణ్, కమిటీ సభ్యులు వారణాయలు పాల్గొన్నారు.

# శ్రీ నూకాలమ్మ తల్లి నెలపండుగకు హాజరుకావాలని ప్రముఖులకు ఉత్సవ కమిటీ సభ్యుల ఆహ్వానం






**భీమునిపట్నం ఏప్రిల్ 10 నేటి మనదేశమ్ :** భీమిలి గ్రామదేవత శ్రీనూకాలమ్మ తల్లి మహోత్సవాల్లో భాగంగా ఈనెల 17వ తారీకు శుక్రవారం నెలపండుగ సందర్బంగా అమ్మవారి దర్శనానికి రావాలని కోరుతూ పలువురు ప్రముఖులకు ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానం అందించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావుకి, విశాఖ పోలీస్ కమీషనర్ శంకబ్రత బాక్చికి, మాజీ మంత్రివర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు (అవంతి) మరియు భీమిలి నియోజకవర్గం వైసిపీ ఇంచార్జ్ మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) తో సహా పలువురు ప్రముఖులను ఉత్సవకమిటీ సభ్యులు గంటా నూకరాజు, శిల్లా కరుణాకర్ రెడ్డి, మారోజు సత్యప్రసాద్ (గొల్లబాబు), గాడు యస్వంత్ కుమార్, ఉసిరికల బంగార్రాజు (తాతాజీ) లు స్వయంగా వారి కార్యాలయాలకు వెళ్లి ఆహ్వానించారు. మార్చి 17 నుండి 20వ తారీకు వరకు జరిగిన భీమిలి శ్రీ నూకాలమ్మ తల్లి ఉత్సవాలు అందరి ప్రముఖులు మరియు అన్ని డిపార్ట్మెంట్ల అధికారుల సహాయసహకారాలతో విజయవంతంగా జరిగాయని అన్నారు. నెల పండుగ మహోత్సవాన్ని కూడా విజయ వంతం చేయడంలో సహకరించాలని విజ్ఞప్తి చేసారు. అదేవిదంగా ఈనెల 17వ తారీకున శ్రీ నూకాలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం 12గం. ల. నుండి అమ్మవారి చదునుపట్టు వద్ద అన్నసమారాధన జరుగుతుందని అన్నారు. అదేరోజు సాయంత్రం 4 గం. లకు శ్రీ నూకాలమ్మ ఆలయం నుండి గంటస్తంభం, చిన్న బజార్, బస్టాండ్ మీదుగా వివిధ నేలవేషాలతో భారీ ఊరేగింపు ఉంటుందని అన్నారు. సాయం త్రం 7 గం. ల నుండి గంట స్తంభం స్టేజ్ వద్ద డాన్స్ మస్తీ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. భీమిలి పట్టణ ప్రజల ఆరాధ్యదైవం శ్రీ నూకాలమ్మ తల్లి నెలపండుగ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ప్రముఖులను ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ప్రముఖులను ఆహ్వానించిన వారిలో ఉత్సవ కమిటీ సభ్యులు రాంబుక్త ప్రభాకర్ నాయుడు, కంచెర్ల కామేష్, లాలూ తదితరులు పాల్గొన్నారు.

# 30 ఏళ్లయినా అమరావతి పూర్తి కాదు

**- వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల**



**అమరావతి, ఏప్రిల్ 10 నేటి మనదేశమ్ :** ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో మరో 30 ఏళ్లు పూర్తయినా అమరావతి పూర్తి కాదని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ఏర్పాటు చేసిన నయారాయపూర్‌లో ఇప్పటికీ భవనాలు మాత్రమే ఉన్నాయని, జనం లేరని తెలిపారు. సిఎం చంద్రబాబు లెక్కల ప్రకారమే అమరావతికి రూ.2.3 లక్షల కోట్లు కావాలని, ఇప్పుడు కొంతమంది అధికారులు ఉండటానికి మాత్రమే భవనాలు పూర్తి చేస్తున్నారని, రైతులకు ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్లలో డెవలప్‌మెంట్ లేదని పేర్కొన్నారు. మావిగన్ అలాకాదని, పదిశాతం ఖర్చుతో మరుసటి రోజే రాజధాని అవుతుందని తెలిపారు. మావిగన్ ఇప్పటికే ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్, బస్టాండు, బందరు పోర్టుతో అనుసంధానం అయిందని తెలిపారు. రాజధాని పేరుతో చంద్రబాబు.. ప్రజల్లో భ్రమలు సృష్టిస్తున్నారని విమర్శించారు. భావితరాలకు అన్యా యం చేస్తున్నారని జగన్ చెబుతున్నారని, మావిగన్ ఆలోచనను పలు దఫాలుగా జగన్ చెప్పారని అన్నారు. చంద్రబాబు సమాధానాల్లో డొల్లతనం ఉందని పేర్కొన్నారు.

భూములు ఇప్పుడు అమ్మితే రేట్లు రావని చెబుతున్న ముఖ్యమంత్రి ఎప్పుడు అమ్మితే రేట్లు వస్తాయో చెప్పగలరా? అని ప్రశ్నించారు. కోర్టులు తెచ్చిన చిక్కుల వల్లే మూడు రాజధానుల నిర్ణయం ఆగిందని తెలిపారు.

## గల్ఫ్ నుంచి తెలుగు వారి కోసం ఫ్లైట్... ముందుకు వచ్చిన జజీర ఎయిర్ లైన్స్

**విజయవాడ, ఏప్రిల్10 :** పశ్చిమాసియాలో యుద్ధంతో గల్ఫ్‌లో చిక్కుకుపోయిన తెలుగువారు స్వదేశానికి రావడానికి కొత్త విమాన సర్వీసులు అందుబాటులోకి వస్తున్నాయి. యుద్ధానికి రెండు వారాల పాటు విరామం లభించడంతో సౌదీ అరేబియాలోని దమ్మమ్ నుంచి, విజయవాడ మధ్య రిలీఫ్ ఫ్లైట్స్ నడపడానికి జజీరా ఎయిల్‌లైన్స్ సిద్ధమైంది. ఈనెల 13 నుంచి 29 వరకు ఆ ప్రత్యేక సర్వీసులు నడపనుంది. ఈ మేరకు విజయవాడ విమానాశ్రయ అధికారులకు సమాచారం ఇవ్వటంతో పాటు స్లాట్‌ను బుక్ చేసుకుంది. సోమ, బుధ, శుక్రవారాల్లో ఆ విమానాలు నడుస్తాయి. ఎయిర్‌పోర్టు అధికారులకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం విజయవాడ, దమ్మమ్‌ల మధ్యనే విమానాలు నడుస్తాయి. దమ్మమ్‌కు చేరాక అక్కడి నుంచి కువైట్‌కు కూడా ఈ సర్వీసులు వెళ్లనున్నట్టు తెలుస్తోంది.

Edited, Printed, Published and owned by K.S. Ranga Sayi and published from 8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027 (A.P.) Printed at SKYLINE PRESS, D.N`•.8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027. (A.P) Ph: 0891-2531616, Email: netimanadesamvizag16@gmail.com